# 14

# సంబంధములలో గల బాధ్యతలు

## కొలొస్సయులకు 3:18-4:1

కుటుంబ సభ్యుల నడుమ ఉండవలసిన సత్సంబంధముల గూర్చి పౌలు 3:18–4:1లో చేసిన చర్చలో, ఆయన తన ఆదేశములను మరియు సంక్షిప్త వివరణలను నానావిధ గుంపులకు నివేదించాడు.[1] లోబడియుండవలసిన మూడు గుంపులకు చెందినవారిని ఆయన సంబోధించాడు: భార్యలు (3:18), పిల్లలు (3:20), మరియు దాసులు (3:22–25). ఇతరమైన మూడు గుంపులకు చెందినవారికి, వారి క్రింద నుండువారి గూర్చి వహించవలసిన శ్రద్ధకు సంబంధించిన బాధ్యతలు ఒప్పజెప్పబడినవి: భర్తలు వారి భార్యలను "ప్రేమింపవలెనని" తెలియజెప్పబడిరి (3:19); "మీ పిల్లల మనస్సు కృంగకుండునట్లు వారికి కోపము పుట్టింపకుడి" అంటూ తండ్రులకు ఆదేశములియ్యబడినవి (3:21); మరియు "న్యాయమైనదియు ధర్మానుసారమైనదియు … చేయుడి" అని యజమానులకు ఆజ్ఞాపింపబడినది (4:1).

వారు ఇతరుల యెడల నిర్వహించవలసిన అధికార పాత్రలు ఇవ్వబడిన భర్తలు, తండ్రులు, మరియు యజమానులు వారి అధికారమును దుర్వినియోగము చేసికొనకూడదు, కానీ వారి క్రింద నుండువారి మేలు నిమిత్తము దానిని సద్వినియోగము చేసికొనవలెను. కుంటుంబ సంబంధమైన బాధ్యతలు పేర్కొనబడిన సందర్భములో బానిసలు/దాసులు గూర్చి పేర్కొనబడినది ఏలయనగా వారిలో కొందరు కుటుంబ వ్యవస్థలలో ఉపచార పనులు చేయుచుండిరి.

పౌలు ఏర్పాటుచేసిన ప్రమాణము ప్రకారము, అధికారములో ఉన్నవారు వారిక్రింద నుండవారి మేలును వెదకవలసిన బాధ్యతలు కలిగియున్నారు, వారి క్రింద నుండువారు వారిపై అధికారుల యెడల తగు మర్యాద చూపవలెను. వాందరు ఏ గుంపునకు చెందినవారైనను వారు తనదికాని గుంపునకు చెందినవారి అనుభూతులను మరియు అవసరములను తోసిపుచ్చకూడదు. ప్రతి ఒక్క సంబంధములో రెట్టింపు బాధ్యత కలిసియున్నది. యేసు యెడల నున్న బాధ్యత మొదటిది మరియు అత్యున్నతమై బాధ్యతయై యున్నది, ఒకరి యెడల మరొకరికి గల బాధ్యత, రెండవది. క్రీస్తును సంతోషపర్చుట ప్రాథమిక లక్ష్యమై యుండవలెను; ఇతరులను సంతోషపర్చుట ద్వితీయ శ్రేణికి చెందిన బాధ్యతయై యున్నది.

ఒకరికొకరు లోబడి యుండుట గూర్చి పేతురు తన మొదటి పత్రిక, 2:13 మొదలుకొని 3:7 వరకు చేయుచున్న చర్చలో, వారు అధికారులకును పరిపాలకులకును లోబడవలెనని క్రైస్తవులు మొదట మందలింపబడిరి (2:13–16). అది వారి యెడల పై అధికారులు దౌష్ట్యముగా వ్యవరించుచున్న పరిస్థితియైనప్పటికిని, యేసు అనుచరులు వారికి లోబడవలెను, ఏలయనగా యేసు సహించినది అదే (2:17–25). క్రైస్తవులైన భార్యలు వారి భర్తలకు, వారు అవిశ్వాసులైనప్పటికిని, వారికి లోబడియుండవలెనని ఆదేశములు జారీచేయబడినవి

(1 పేతురు 3:1–6). భార్య, భర్తకు లోబడుట సరిగ్గా ఆమె ప్రభుత్వమునకు లోబడుటవంటిది కాదు. విశేషంగా, భార్య తన భర్తకు లోబడుచుండుట ఆమె తన భర్త యెడల కలిగియున్న ప్రేమ మరియు వారిరువురు నడుమ గల సంబంధములలో నెలకొని యున్న సన్నిహితముపై ఆధారపడియుండును.

పరిపూర్ణమైన ఆదర్శం యేసే. పరలోక తండ్రికి ఆయన విధేయుడైన కుమారుడై యుండెను (ఫిలిప్పీయులకు 2:8; హెబ్రీయులకు 5:8; 10:9) కాబట్టి పిల్లలు చూపించవలసిన విధేయతకు ఆయన ఒక మంచి మాదిరియై యున్నాడు. ఒక యౌవ్వనుడుగా, యేసు తన తలిదండ్రుల యెడల విధేయుడై యుండెను. ఈ సందర్భములో, గొప్పవాడైనవాడు అల్పులైనవారికి లోబడుచున్నాడు; గనుక పిల్లలు, భార్యలు, మరియు దాసులు – వారు ఉన్నతమైన సామర్థ్యము కలిగియున్నప్పటికిని, లోబడియుండవలెననుటకు ఇది ఒక చక్కని మాదిరియై యున్నది. మరణ శ్రమలను ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు సహితము, యేసు తన తల్లి గూర్చి ఆందోళన చెందుచుండెను. పిల్లలు వారి తలిదండ్రులకు తగిన సమకూర్పులు ఏర్పాటు చేయవలెననుటకు, భర్తలు వారి భార్యల గూర్చి తగు శ్రద్ధ వహించవలెననుటకును ఈ చింత వారికి ఒక మంచి మాదిరియై యున్నది. యేసు తన శిష్యుల పాదములు కడిగాడు, తద్వారా ఆయన అక్షరాలా ఆచరణయోగ్యమైన అభ్యాసమును ప్రదర్శించాడు – ఒక యజమానుడు తన దాసులకు చేయవలసిన పరిచారమునకు ఇది మంచి మాదిరియై యున్నది. యేసు, “పరిచారము చేయించుకొనుటకు రాలేదు, కానీ పరిచారము చేయుటకు” వచ్చాడు (మత్తయి 20:28), దాసులకును, తలిదండ్రులకును మరియు పిల్లలకు సహితము ఇది ఒక మంచి మాదిరియై యున్నది.

చేయబడు సమస్తము “ప్రభువు పేరట” చేయబడవలెను గనుక, కొలొస్సయులకు 3:17 ప్రకారము, పౌలు తన విన్నపమునకు ప్రభువును ఆధారంగా చేసుకొన్నాడు, కొలొస్సయుల ప్రతిస్పందన, “ప్రభువును బట్టి యుక్తమైనదై” యుండవలెను (కొలొస్సయులకు 3:18). మరియు “ప్రభువునుబట్టి మెచ్చుకొనదగినదై” యుండవలెను (కొలొస్సయులకు 3:20). వారు ఏమి చేసినను ప్రభువునకు భయపడుచున్నవారై (కొలొస్సయులకు 3:22), వారికిని పరలోకమందు ఒక “యజమానుడు” (*kurios*, “ప్రభువు”) ఉన్నాడని యెరిగినవారై (కొలొస్సయులకు 4:1). “ప్రభువు నిమిత్తమని” (కొలొస్సయులకు 3:23) మనస్ఫూర్తిగా చేయవలెను. వారికియ్యబడు బహుమానము లేదా శిక్ష “ప్రభువు వలన” పొందుదురని వారు తెలిసికొనవలసినవారై యుండిరి (కొలొస్సయులకు 3:23–25).

భార్యలు తమ భర్తలకు “ప్రతి విషయములోను” లోబడవలెను (ఎఫెసీయులకు 5:24). దీనికి తారతమ్యముగా, వారు లోబడుట మాత్రమే కాదు, కానీ విధేయులై యుండవలెనని కూడ దాసులకు తెలియజెప్పబడినది (తీతు 2:9; 1 పేతురు 2:18). “విధేయులై యుండుడి” అనుటకు బదులుగా, “లోబడి యుండుడి” అని భార్యలకు ఉద్బోధింపబడుట, తండ్రులు మరియు పిల్లలకు మధ్య లేదా యజమానులకును దాసులకును మధ్య ఉండు సంబంధము కంటె, భార్యాభర్తల మధ్య గల ఒక భిన్నమైన సంబంధమును సూచించుచున్నది (కొలొస్సయులకు 3:20పై గల చర్చను చూడుము). భార్యలు తమ భర్తల యెడల లోబడుచున్న మర్యాద చూపవలెనని తెలియజెప్పబడిరి, అయితే పిల్లలు మరియు దాసులు “అన్ని విషయములలో” మర్యాదపూర్వకముగా లోబడవలెను (ఎఫెసీయులకు 6:1, 5;

కొలొస్సయులకు 3:20, 22).

"లోబడుము" లేక "లోబడి యుండుట" (*hupotassō*) – భార్యలకు మాత్రమే కాదు. ఈ పదము క్రొత్త నిబంధనలో ఏ యే కోణాల్లో ప్రయోగింపబడినదో చూద్దాము:

లూకా 2:51 – యేసు తన తలిదండ్రులకు లోబడ్డాడు.
లూకా 10:17 – యూదులు వెళ్లగొట్టుటకు అధికారమిచ్చి యేసు పంపిన డెబ్బది మందికి దయ్యములు లోబడుచుండినవి.
రోమీయులకు 10:3 – యూదులు దేవుని నీతికి లోబడలేదు.
రోమీయులకు 13:1, 5 – క్రైస్తవులు ప్రభుత్వమునకు లోబడవలెను (తీతు 3:1; 1 పేతురు 2:13 చూడుము).
1 కొరింథీయులకు 14:32 – ప్రవక్తల ఆత్మలు ప్రవక్తలకు లోబడుచుండినవి.
1 కొరింథీయులకు 14:34 – ధర్మశాస్త్రము కూడ చెప్పుచున్నట్లు, స్త్రీలు లోబడియుండవలెను.
1 కొరింథీయులకు 15:27 – సమస్తము యేసునకు లోబడియుండునట్లు చేయబడినది.
ఎఫెసీయులకు 5:21 – క్రైస్తవులు ఒకరికొకరు లోబడియుండవలెను.
ఎఫెసీయులకు 5:24 – సంఘము క్రీస్తుకు లోబడియుండవలెను.
ఫిలిప్పీయులకు 3:21 – యేసు సమస్తమును తనకు లోపరచుకొన గలుగుచున్నాడు.
తీతు 2:9 – దాసులు తమ యజమానులకు లోబడవలెను (1 పేతురు 2:18 చూడుము).
హెబ్రీయులకు 12:9 – క్రైస్తవులు దేవునికి లోబడియుండవలెను.
1 పేతురు 3:22 – దేవదూతలు మరియు అధికారులు క్రీస్తుకు లోబడియుండవలెను.
1 పేతురు 5:5 – చిన్నలైన క్రైస్తవులు పెద్దలైన క్రైస్తవులకు లోబడియుండవలెను.

దేవుని దృష్టిలో నుండు ఆధ్యాత్మిక సమానత (గలతీయులకు 3:28) సమస్త మానవీయ సంబంధములలో వారికి సమానత నిచ్చునని క్రైస్తవులు అనుకొనకూడదు. యజమానుడు తన దాసునికి, తలిదండ్రులు తమ పిల్లలకు, లేక భర్త భార్యకు లోబడుట తప్పనిసరైన సంగతి కాదు. విశేషంగా, ప్రతి విషయంలోను ఇందుకు వ్యతిరేకమైనది వాస్తవమని యేసు నిర్ధారించాడు. మనము మన ప్రభువైన యేసుక్రీస్తును సంతోషపెట్టుటకు, ఔషధ చీటివలె ఆయన నిర్దేశించిన క్రమమును గౌరవపూర్వకముగా అనుసరించవలెను.

కొలొస్సయులకు 3:12–14లో వ్యక్తిగత శీలమునకు సంబంధించిన సులక్షణముల కొరకైన పునాది వేసిన తరువాత, పౌలు ఆ యా సూత్రములను కొలొస్సయుల అనునిత్య కుటుంబ సంబంధములకు అన్వయించుచున్నాడు. ఇవి "ప్రభువైన యేసు నామములో" పాటింపబడినవి (3:17), అనగా, ఆయన చిత్త ప్రకారము అనుసరింపబడినవని అర్థము.

తలిదండ్రులు మరియు పిల్లలు కోపము, ఆగ్రహము, దుష్టత్వము, దూషణ, అబద్ధములను (కొలొస్సయులకు 3:8, 9). నిగ్రహించుకొన్నప్పుడు కుటుంబ వ్యవస్థ పెట్టింపు ఆశీర్వాదమును పొందుకొనును. ఒక కుటుంబమును ఆనందకరమైన కుటుంబముగా చేయుటకు ఈ దుర్గుణములు లేకుండుట మాత్రమే సరిపోదు, కానీ కొన్ని సద్గుణములు సహితము ఉండవలెను – జాలి, దయ, వినయము, సాత్వికము, దీర్ఘశాంతము, క్షమాపణ, మరియు ప్రేమ మొ॥ ఉండవలెను (3:12–14). చిట్టచివరి సద్గుణము, ప్రేమ, వ్యతిరేకార్థక గుణములను నిర్మూలించి, కుటుంబ సభ్యులనందరిని సామరస్యముగాను అనురాగసహితముగాను బంధించినట్లు నిర్మాణాత్మకమైన వాటిని నొక్కివక్కాణించుటలో

కుటుంబమునకు సరైన సహకారమునందించు సహాయకారియగును.

## భర్తల యెడల భార్యల ప్రవర్తన (3:18)

**[18]భార్యలారా, మీ భర్తలకు విధేయులై యుండుడి, ఇది ప్రభువునుబట్టి యుక్తమై యున్నది.**

### "భార్యలారా, మీ భర్తలకు విధేయులై యుండుడి" (3:18)

భార్యలు తమ భర్తలకు "ప్రతి విషయములోను" లోబడియుండవలెను (ఎఫెసీయులకు 5:24). భర్తలకు లోబడి యుండవలెనని భార్యలకు పౌలు ఆదేశించుచు, వర్తమానకాల విధివాచకమును వినియోగించాడు, భార్యలు నిరంతరము (కొనసాగుచుండు) లోబడియుండుటను ఇది సూచించుచున్నది (*Hupotassō* నుండి వచ్చిన *hupotassesthe*). *Hupotassō*కు రాబర్ట్ జి. బ్రాచర్ మరియు యూజిన్ ఏ. నిడా ఈ క్రింది నిర్వచనమును ఇచ్చారు:

> అది సేనా సందర్భములలో క్రింది స్థానంలో ఉన్నవాడు వాని పై అధికారితో సేనా అధికార వరుస క్రమము చొప్పున కలిగియుండు సంబంధము సందర్భములో ప్రయోగింపబడిన ఒక పదమై యున్నది. ఇంకా, భార్య తన భర్తతో కలిగియుండు సంబంధమును తెలుపుచు ఎఫెసీయులకు 5:22, తీతు 2:5, 1 పేతురు 3:1లోను; దాసులు వారి యజమానులతో కలిగియుండు సంబంధము గూర్చి తీతు 2:9, 1 పేతురు 2:13లోను; పౌరులు ప్రభుత్వముతో కలిగియుండు సంబంధమును తెలుపుచు రోమీయులకు 13:1లోను అది వాడబడినది.[2]

కొలొస్సయులకు 3:18లో వ్రాయబడినదంతా లైంగిక సంబంధము విషయములో లోబడుటకు సంబంధించినదై యున్నదని అనుకొనకూడదను ఒక హెచ్చరిక ఇచ్చుట చేయవలసి యున్నది. ఈ విషయము అందులో ఉన్నప్పటికిని, అది "లోబడి యుండుము" యొక్క ఉద్దేశమును పూర్తిగా వినియోగించదు. భార్యాభర్తల లైంగిక సంబంధము గూర్చి పౌలు మరొక చోట వివరించాడు (1 కొరింథీయులకు 7:3-5).

భార్య, తన భర్త ఇష్టమునకు ఇష్టపూర్వకముగాను మనస్ఫూర్తిగాను ప్రతిస్పందించవలెనని బైబిలు సంబంధమైన ఉదాహరణములు సవివరంగా చిత్రీకరించుచున్నవి. శారా, క్రైస్తవ స్త్రీలకు ఒక మంచి ఉదాహరణమై యున్నదని పేతురు తన మొదటి పత్రిక 3:5, 6లో చూపించుచున్న స్త్రీ, అబ్రాహాముకు "లోబడియుండినది." ఆమె అబ్రాహామును "యజమానుడు" అని సంబోధించుచు ఆయనకు "లోబడియుండెను." *Hupakouō* నుండి ఉత్పన్నమగుచున్న "లోబడుట"/ "చెప్పినట్లు," పిల్లలు వారి తలిదండ్రులకును, దాసులు వారి యజమానులకును "లోబడవలెనని" ఆజ్ఞాపింపబడినట్లుగా, స్త్రీల విషయంలో ఎన్నడైనను ఆజ్ఞాపింపబడలేదు.

ఇంకా కొన్ని ఇతర వాక్యభాగాలను చూద్దాము. ఎఫెసీయులకు 5:22-24 ఇలా చెప్పుచున్నది,

> స్త్రీలారా, ప్రభువునకు వలె మీ సొంతపురుషులకు లోబడియుండుడి. క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్న లాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై

యున్నాడు. సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలుకూడ ప్రతి విషయములోను తమ పురుషులకు లోబడవలెను.

"దేవుని వాక్యము దూషింపబడకుండునట్లు, యౌవ్వనస్త్రీలు తమ భర్తలకు లోబడియుండవలెనని" తీతు 2:5 సెలవిచ్చుచున్నది. అదే విధంగా, "అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి ..." మరియు "పూర్వము దేవుని ఆశ్రయించిన, పరిశుద్ధ స్త్రీలును, తమ స్వపురుషులకు లోబడి యుండుట చేత, తమ్మునుతాము అలంకరించుకొనిరని" పేతురు రచించాడు (1 పేతురు 3:1, 5).

స్త్రీలకు గొప్ప స్వాతంత్రము ఇయ్యబడినది మరియు వారు తమ నుండి పొందుకొనవలసిన మర్యాద మరియు ప్రేమకు అర్హులనుగా చేయు ఉన్నత స్థానమునకు యేసు చేత ఎత్తబడ్డాడు. భర్తలపై, భార్యలపై కాదు, కుటుంబ పోషణార్థమై అవసరమైన వాటిని సమకూర్చవలసిన భారము మోపబడినది. బాధ్యత ఒప్పజెప్పబడి యున్నది. ఈ బాధ్యతాయుతమైన భారములు వారిపై మోపబడినందుకు క్రైస్తవ స్త్రీలు హర్షిస్తూ కృతజ్ఞులై యుండాలి. కుటుంబ అవసరములను పర్యవేక్షించుటకు ఆందోళన కలిగించు ఇట్టి కార్యభారమును తమ భుజస్కంధములపై వేసికొనుటకు వారు ప్రయత్నించకూడదు, అవన్నీ వారి భర్తలకు వదిలిపెట్టవలెను. భర్తలు సమకూర్చు శ్రద్ధనుబట్టి, భార్యలు తమ భర్తలతో సహకరించుచుండవలెను, కానీ హఠము చేయుచు, పెంకితనముతో ఉండకూడదు.

**"ప్రభువునుబట్టి యుక్తమై యున్నది" (3:18)**

ప్రభువునుబట్టి యుక్తమై యున్నది అను పదజాలము స్త్రీలు వారి భర్తలకు లోబడియుండు విషయంలో విచక్షణాసహితమైనవారై యుండవలసిన అవసరతము వ్యక్తము చేయుచున్నది. వారు లోబడియుండుట క్రైస్తవ స్త్రీలకు తగినదై యుండవలెను. వారు తమ భర్తల మనవులను శిరసావహించవలెను. కానీ, అట్టి మనవులు యేసు చిత్తమునకు విరోధమైనవై యుండకూడదు. ఇటువంటి మనవులు "యుక్తమైనవై" (*anēken*) యుండవు, అనగా సరియైనవై మరియు సముచితమైనవై యుండవు. పౌలు ఎఫెసీయులకు 5:4లో అనుచితమైన సంభాషణకు సంబంధించి వ్యతిరేకార్థముతోను, ఒనేసిము కోసరము అతనికి చేయబడిన మనవిని ఫిలేమోను నెరవేర్చగలడని వానిలో కలిగియుండిన నమ్మకమునకు సంబంధించి నిర్మాణాత్మకమైన భావముతో ఫిలేమోను 8, 9లోను, ఈ పదమును వినియోగించాడు.

భార్యలు ఇష్టపూర్వకమైన లొంగుబాటును ప్రదర్శించు విధానములో తమ భర్తల యెడల ప్రతిస్పందించవలెను. వైరభావము, ద్వేషము, లేక పగతో కూడిన లొంగుబాటు "యుక్తమైనది" కాదు. తన భర్తకు సంంధించినంత వరకు భార్య కొలొస్సయులకు 3:8, 9లో పేర్కొనబడిన దుర్గుణములలో దేనికైనను ఆమడ దూరములో ఉండవలెను. దానికి బదులుగా, ఆమె కొలొస్సయులకు 3,12-14లో పేర్కొనబడిన సద్గుణములను తన చర్యల ద్వారా ప్రదర్శించుటకు ప్రయత్నించవలెను. ఇవి యేసును ప్రేమించుచు ఆయనను సేవించగోరువారి గుణగణములై యున్నవి. ఈ విధంగా జీవించుట ద్వారా, క్రీస్తు కనుపర్చిన అణుకువగల వైఖరిని ఆమె ప్రతిబింబించును, ఆయన తన పరలోక తండ్రికి విధేయుడయ్యాడు (ఫిలిప్పీయులకు 2:8; హెబ్రీయులకు 5:8). ఇతరమైన ఏ ప్రతిస్పందనయైనను అనురాగమునైనను క్రైస్తవ భార్యకు యుక్తమైనదై యుండదు.

అవిశ్వాసియైన భర్త యెడల భార్య కలిగియుండు బాధ్యత గూర్చి పౌలు ఈ వాక్యభాగములో చర్చించలేదు. ఈ సందర్భములో భార్యకు అవసరమైన ఆదేశములు 1 కొరింథీయులకు 7:12–16 మరియు 1 పేతురు 3:1–6లో ఇవ్వబడియున్నవి. "... మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి, అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ పవిత్ర ప్రవర్తన చూచి, వాక్యము లేకుండానే తమ భార్యల నడవడివలన రాబట్టవచ్చునని" అవిశ్వాసులైన భర్తలను కలిగియున్న భార్యలకు తెలియజెప్పడమయ్యింది (1 పేతురు 3:1, 2).

## భార్యల యెడల భర్తల ప్రవర్తన (3:19)

**19భర్తలారా, మీ భార్యలను ప్రేమించుడి, వారిని నిష్ఠురపెట్టకుడి.**

**"భర్తలారా, మీ భార్యలను ప్రేమించుడి, వారిని నిష్ఠురపెట్టకుడి" (3:19)**

ఆమె జాలిగుండెలుగలవాడును అనురాగసహితుడునై అహంకార నియంత కాని భర్తను కలిగియున్నప్పుడు, భార్య లోబడవలసిన తన పాత్ర సులభతరమవుతుంది. భర్తలు వారి భార్యల పట్ల చూపించు చర్యలు ప్రేమ చేత నియంత్రింపబడుచున్నవై యుండవలెను. భర్త తన భార్య యెడల కలిగియుండు సంబంధము ప్రేమ (*agapaō*; వర్తమానకాల విధివాచకము) చేత నియంత్రింపబడుచున్న అంశమై యుండవలెను. భర్త తన భార్యకు విరోధముగా నిష్ఠురపడకూడదు (బాధాకరమైన చేదు భావాలను కలిగియుండకూడదు). "నిష్ఠురపడుట" యని అనువదింపబడిన క్రియాపదము (*pikrainō*) క్రొత్త నిబంధనలో మరొక చోట మాత్రమే కనిపించును (ప్రకటన 8:11; 10:9, 10).

వివాహమునకు ముందుండిన అనురాగసహితమైన అదే వివాహమైన తరువాత కూడ కొనసాగుచుండవలెను. భార్యాభర్తల నడుమ నెలకొని యుండు అనురాగసహితమైన బంధమునకు కళ్యాణ మహోత్సవము నాటి వేడుక దాని అంతము కాదు. ఈ పదజాలమును, "పురుషులారా, మీ స్త్రీలను ప్రేమించుడి" అని కూడ అనువదింపవచ్చును. భర్తలు అని అనువదింపబడిన గ్రీకు భాషా పదము *andres*, "పురుషులు" లేదా "భర్తలను" సూచించును; భార్యలు అనువదింపబడిన గ్రీకు భాషాపదము *gunaikes*, "స్త్రీలు" లేదా "భార్యలను" సూచించును. ఈ పదములు సందర్భోచితంగా అనువదింపబడవలెను. ఈ ఏర్పాటు ప్రకారము భర్తలు తమ భార్యలను ప్రేమింపవలెననునది అర్థమని స్పష్టముగా తెలియుచున్నది.

పౌలు ఇచ్చట మరియు ఎఫెసీయులకు 5:25లో వ్రాసినట్లుగా, భార్యభర్తల అనుబంధ సంబంధమును నియంత్రించు భావోద్రేకము భర్త ప్రదర్శించవలసిన "ప్రేమ"యై యుండవలెను. భార్యలు తమ భర్తలను "ప్రేమింపవలెనని" (*agapaō*) క్రొత్త నిబంధనలో ఎన్నడును ఆదేశింపబడలేదు. తీతు 2:4లో వ్రాయబడినట్లుగా యౌవ్వనులైన స్త్రీలు వారి భర్తలను "ప్రేమింపవలెనని" వృద్ధులైన స్త్రీలు వారికి నేర్పించవలెను. అచ్చట వాడబడిన *philandres*, అను సంయుక్త పదము *phileō* ("ప్రేమ") మరియు *anēr* ("భర్త") అను పదములు ఉపయోగించబడెను.

ఒకనిని వాని చర్యల విషయంలో ప్రేమ ఎలా ప్రభావితముగా నడిపిస్తుందో, పౌలు

1 కొరింథీయులకు 13:4-8లో ఒక దివ్యమైన వర్ణననిచ్చాడు. వారి ప్రేమను కనుపర్చుటకు పిసినారులుగా ప్రవర్తించుట, వారు చెప్పునదే సరైనదను ఆత్మవిశ్వాసమును కనుపర్చుట, మరియు పెత్తనం చెలాయించుటయే ఒక మార్గమని విశ్వసించు భర్తలు ఈ వాక్యభాగమును తరచుగా అధ్యయనము చేయుచు తదనుగణముగా వారి అనురాగమును తమ అర్ధాంగుల యెడల కనుపర్చుటకు వెదకుచుండవలెను.

భర్త తన భార్య చేత ఉద్రేకము పుట్టించబడినవాడైనప్పుడు లేక "నిష్టురపెట్టబడినప్పుడు," ఆయన తన ఆగ్రహమును మరియు నిష్ఫలతతో కలుగు నిరుత్సాహమును బలప్రయోగము ద్వారా ప్రదర్శించుటకు ఉన్ముఖుడై యుండగలడు. వారి భార్యలు వారి కంటె బలహీనులని భర్తలు వారి భార్యల విషయములో అర్థంచేసికొనవలెనని పేతురు రచించాడు (1 పేతురు 3:7).

ప్రేమానురాగములు మరియు దయ కలిగియుండి కీడుకు ప్రతికీడు చేయకుండుట ద్వారా (రోమీయులకు 12:17), భర్త భార్యతో సమాధానకరమును సామరస్యముతో కూడినదైన సంబంధమును స్థాపించవచ్చును. తన భార్య మనస్సును అర్థం చేసికొనుటకు భర్త ప్రయత్నించవలెను. ఇరువురు కలిసి వారి అనుభూతులను ఒకరితో మరొకరు పంచుకొనుటకు ఆశించునట్లు నేర్చుకొనవలెను, ఒకరినొకరు పెనవేసుకొనుచున్నవారై, దయ మరియు సౌహార్దము ద్వారా కనుపర్చబడు ప్రేమ చేత ఒక్కటిగా కట్టబడవలెను. కొలొస్సయులకు 3:8, 9లో పేర్కొనబడిన పాపములను నిర్మూలించుకొనుచు 3:12-14లో పేర్కొనబడిన సులక్షణములను అభివృద్ధి చేసికొనుచు భార్యాభర్తలిరువును అన్వయించుకొనవలెను.

భర్త తన భార్యపై పెత్తనం చెలాయించుటకును, ఆమె తనకు కచ్చితంగా లోబడియుండవలసినదేనని అధికారస్వరంతో అడుగుటకును ప్రోత్సాహింపబడుట లేదు. కానీ, భర్త తన భార్యను ప్రేమింపవలెనని చెప్పబడుచున్నాడు. భార్యకు ప్రేమగల శిరస్సైయున్నవాడు, సంఘము నిమిత్తము యేసు తన్నుతాను అప్పగించుకొనునట్లుగా (ఎఫెసీయులకు 5:25), భర్త తనను తాను తన భార్యకు అప్పగించుకొనుటకు ఇష్టపడుచున్నట్లయితే, వైవాహిక సంబంధము ఏమైయుండవలెనో, అంతే గంభీరమైనదై యుండును. ప్రేమ, భార్యను ఒక "వస్తువు"గా దృష్టించు స్థితి నుండి, భర్త తన భార్య శాయశక్తులా చేయుచు తన గొప్ప సేవానిరతియని ఆమె యెడల ప్రకటించుటకు అర్హురాలై ముద్దులొలుకు సహవాసియైయున్న అంతస్తునకు ఆమెను పైకెత్తును.

భార్య, తన భర్త యొక్క లైంగిక ప్రగాఢ వాంఛలను మాత్రమే తీర్చుటకు ఉద్దేశింపబడినదై యున్నట్లయితే, పౌలు *eraō* అను గ్రీకు క్రియాపదమును ("లైంగిక సంభోగ ప్రేమ"ను సూచించు పదమును) ప్రయోగించేవాడే. దానికి బదులుగా, పౌలు *agapaō*, అనగా త్యాగపూరితమును తననుతాను సమర్పించుకొనునదైన ప్రేమ గూర్చి మాటలాడుచున్నాడు. గనుక భర్త, తన సొంత సంక్షేమము కంటె తన భార్య సంక్షేమమునకు ప్రథమ స్థానమును ఇయ్యవలెనని ఇది సూచించుచున్నది.

## తలిదండ్రుల యెడల పిల్లల ప్రవర్తన (3:20)

**20పిల్లలారా అన్ని విషయములలో మీ తలిదండ్రుల మాట వినుడి, ఇది ప్రభువుబట్టి మెచ్చుకొనదగినది.**

**"పిల్లలారా, అన్ని విషయములలో మీ తలిదండ్రుల మాట వినుడి" (3:20)**

దేవుని ఆజ్ఞలను వర్ణించినప్పుడు పౌలు ప్రయోగించిన నిర్వచనమునకు సంబంధించి పీటర్ టి. ఓబ్రయెన్ ఒక ప్రాముఖ్యమైన విషయమును గమనించాడు: పిల్లలకును దాసులకును ఇవ్వబడిన ఆదేశము కంటె బలమైనదై యున్నది. స్త్రీలు "స్వచ్ఛందంగా లోబడవలెనని" వారికి పిలుపు ఇయ్యబడి యుండగా, పిల్లలు మరియు దాసుల నుండి "నిరపేక్షమైన విధేయత" కోరడమైనది.[3]

పిల్లలు అన్ని విషయములలో (వారి) తలిదండ్రులకు [*goneis*] లోబడవలెనని పౌలు చెప్పాడు. పిల్లలకును దాసులకును ఇయ్యబడిన ఈ ఆజ్ఞ అపరిమితమైన లేక ప్రతిబంధకములులోని లొంగుబాటుని ఎంచబడరాదు. "అన్ని" అని అన్నప్పుడు సరియైనవి మాత్రమే "అన్ని విషయములు" అని అర్థము. దైవభక్తిలోని లేక తండ్రి అధికారస్వరంతో అడుగుదానికిని దేశ చట్టము తెలియజెప్పు దానికిని మధ్య ఘర్షణ ఉన్నట్లయితే, పిల్లలు ప్రభుత్వ నియమములకు లోబడవలెను (రోమీయులకు 13:1–5; 1 పేతురు 2:13). ప్రభుత్వమునకు లోబడవలసిన దానిని మించిన కర్తవ్యముకూడ ఉన్నది: దేవుని నియమములకు లోబడుట (అపొస్తలుల కార్యములు 4:19; 5:29).

పిల్లలు లోబడుటకు వారికిష్టమైన తల్లి లేక తండ్రి చెప్పే మంచి విషయములను మాత్రమే ఎంపికచేసికొనకూడదు. కానీ, పిల్లలు వారి తలిదండ్రుల ఇష్టప్రకారము చేయుచు వారి సొంత ఇష్టాయిష్టముల చొప్పున లేదా వారి దృష్టికి సహేతుకమైనదని తోచిన విషయముల చేత పెడదారి పట్టకూడదు. అదే సమయంలో, పిల్లల నుండి వారు ఆశించు విషయములు పిల్లలు సంపూర్ణ సంక్షేమమును పట్టించుకొననివై వారి స్వప్రయోజనమునకు సంబంధించినవి కావని రూఢిపర్చుకొనుట క్రైస్తవ తలిదండ్రుల బాధ్యతయై యున్నది.

సాధారణంగా, లోబడుచుండు, పిల్లలు దీర్ఘాయుష్యును ఆనందంతో అనుభవించుచుందురు ఏలయనగా దేవుడు వారిని ఆశీర్వదించుచుండును, అంతమాత్రమేగాక, సర్వసాధారణంగా, వారు ఆరోగ్యవంతమైన వైఖరులను మరియు జీవిత విధానములను అభివృద్ధిచేసికొందురు. "పిల్లలారా, ప్రభువునందు మీ తలిదండ్రులకు విధేయులై యుండుడి, ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము (ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది) అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు" అని పౌలు రచించాడు (ఎఫెసీయులకు 6:1–3). వారి తలిదండ్రుల యెడల మర్యాదగా ప్రవర్తించుట, వారిని గౌరవించుట గూర్చి చిన్న వయస్సులోనే నేర్చుకొను పిల్లలు అరుదుగా కటకటాల వెనుక ఊసలు లెక్కబెట్టుదురు. తలిదండ్రుల యెడల భక్తి మర్యాదలు లేని చోట, సమాజమునకు సహితము మర్యాద ఉండదు. అధికారులు కూడ గౌరవింపబడరు. కుటుంబములో అమర్యాద మరియు అగౌరవము నెలకొనియున్నట్లయితే, సమాజము అవినీతిమయమైనదిగా అభివృద్ధియౌతుంది. తలిదండ్రుల యెడల కనపర్చబడు అవిధేయతను పౌలు పతనమైన సమాజము కనుపరచు ఇతర పాపముల జాబితాలో చేర్చాడు (రోమీయులకు 1:28–32; 2 తిమోతి 3:2–5).

మోషే ధర్మశాస్త్రము ప్రకారము, పిల్లలు వారి తలిదండ్రులను గౌరవించవలసినవారై యుండిరి (నిర్గమకాండము 20:12; లేవీయకాండము 19:3). వారి తల్లిదండ్రులను శపించిన పిల్లలు చావగొట్టబడవలెను (నిర్గమకాండము 21:17; లేవీయకాండము 20:9;

ద్వితీయోపదేశకాండము 21:18-21). శాస్త్రులు పరిసయ్యులు ఆయనను అడిగిన ఒక ప్రశ్నకు సమాధానము నిచ్చుచుండినప్పుడు యేసు ఈ ఆదేశమును ఉల్లేఖనముగా ఉదహరించి చెప్పాడు (మత్తయి 15:4).

పిల్లలు వారి తలిదండ్రులకు లోబడనవసరములేదని ఏదైన ఒక వయస్సు లేదా ఒక పరిస్థితి ఉన్నదా? ఈ ప్రశ్నకు పరిశుద్ధ సత్యవేదము దాని సమాధానమును ఎచ్చటైనను తెలియజెప్పుచున్నట్లు తెలియుటలేదు. "పిల్లలు" అను పదము వారు ఎదుగుచు అభివృద్ధిచెందుచుండు వయస్సులో, తలిదండ్రులు నివసించు గృహములో నివసించుచు, తలిదండ్రుల ఆలనా పాలనలో ఉన్నవారని సూచించుచున్నది, అలాగైతే పెరిగి పెద్దవారై తమ్మునుతాముతగు శ్రద్ధగా చూచుకొనుచున్న వారి సంగతేమిటి? వారు తమ తలిదండ్రులతో కలిసి జీవించుచు, వారి ఆర్థిక అవసరముల నిమిత్తము తలిదండ్రులపైనే ఆధారపడుచుండునంత కాలము, పిల్లలు వారి తలిదండ్రులకు లోబడుచుండవలెను. వారు తమ సొంత కుటుంబము, గృహము కలిగియున్నప్పుడు, లోబడవలసిన అవసరము లేదు. ఏది ఏమైనా, వయస్సు మరియు పరిస్థితులతో నిమిత్తము లేకుండా, పిల్లలు తమ తలిదండ్రుల యెడల గౌరవ మర్యాదలు ఎల్లప్పుడు కనుపర్చుచుండవలెను.

**"ఇది ప్రభువునుబట్టి మెచ్చుకొనదగినది" (3:20)**

పిల్లలు విధేయులై యుండవలెను ఏలయనగా అది ప్రభువునకు (*en kuriō*, అక్షరాలా "ప్రభువు నందు") ప్రీతికరమైన విషయమై యున్నది. తలిదండ్రుల యెడల ప్రదర్శింపబడు విధేయత ప్రభువునకు వలె అనుసరణీయమైనదై యుండవలెను. పిల్లలు అంతిమ లక్ష్యము, దేవుని సంతోషపర్చుటయై యుండవలెను. దేవునికి విధేయులై ఆయనకు లోబడుటకు ప్రయత్నించు పిల్లలు వారి తలిదండ్రులను సంతోషపెట్టుటకు వెదకుచుందురు. అలాగే దైవభక్తిగల తలిదండ్రులకు లోబడు పిల్లలు దేవునిసంతోషపెట్టుచున్నవారై యుందురు.

## పిల్లల యెడల తండ్రుల ప్రవర్తన (3:21)

**21 తండ్రులారా, మీ పిల్లల మనస్సు కృంగకుండునట్లు, వారికి కోపము పుట్టింపకుడి.**

**"తండ్రులారా, మీ పిల్లల మనస్సు కృంగకుండునట్లు, వారికి కోపము పుట్టింపకుడి" (3:21)**

సాధారణంగా తండ్రులు అని అర్థమిచ్చు (*pateres* అను పదమును ప్రయోగించుచు, పౌలు తల్లులను మినహాయించుచున్నాడా, లేక ఈ పదము హెబ్రీయులకు 11:23లో అనువదింపబడినట్లుగా, తలిదండ్రులిరువురిని ఉద్దేశించుచున్నాడా? ఆయన భర్తల పాత్ర గూర్చి చర్చించుచున్నాడు కాబట్టి, ఈ ఆదేశము బహుశా తండ్రులనే ఉద్దేశించినదై యుండును. ఏదిఏమైనా, పిల్లలకు శిక్షణ నిచ్చుట తల్లిదండ్రు ఇరువురి బాధ్యతయై యున్నది గనుక ఈ విషయంలో ఇరువురును చేరియుండవలెను. ఈ కారణమునుబట్టియే పౌలు 20వ వచనంలో పిల్లలు వారి తలిదండ్రులకు (బహువచనము) లోబడవలెనని చెప్పుచున్నాడు.

పిల్లలు లోబడవలసినవారై యున్నారు కదా, అలాగని తండ్రి వారిని నిష్ఫలతతో

నిరుత్సాహపర్చుచు వారిని బాధపెట్టు అధికారిగా గాని, నిర్హేతుకముగా నిర్బంధించువాడుగా గాని వారి యెడల ప్రవర్తింపకూడదు. కోపము పుట్టించుట (*erethizō*) అనగా, "చికాకు కలిగించుట, రెచ్చగొట్టుట, నిష్ఠురపర్చుట, లేక ఆగ్రహముతో అసహ్యించుకొనునట్లు" అని అర్థము. పౌలు ఈ పదమును మరొక్కమారే ప్రయోగించాడు, కానీ ఆయన ఇతరులను ప్రోత్సాహించుచు దానిని నిర్మాణాత్మకమైన దృష్టికోణంలో ఉపయోగించాడు (2 కొరింథీయులకు 9:2, "ప్రేరేపింపబడిరి"). ఆయన కొలొస్సయులకు 3:21లో తలిదండ్రులు ఇరువురి గూర్చి మాటలాడినప్పటికిని, పిల్లలకు కోపము పుట్టించు హక్కు తల్లులకున్నదని భావించుట లేదు.

కఠినమైన ఆజ్ఞలనిచ్చుట, ప్రతి చిన్న పొరపాటును ఒక పెద్ద సమస్యగా ఎంచుచు వారిని సరిదిద్దుట, మరీ నిక్కచ్చిగా దబాయించుట, లేదా తీవ్రముగా శిక్షించుట ద్వారా తండ్రులు వారి పిల్లలకు కోపము పుట్టించుచుందురు. పిల్లల్లో క్రమశిక్షణను మరియు నిక్కచ్చితనమును ప్రేమ మరియు దయతో పెంపొందించవలెను. తండ్రులు వారిని నసపెట్టకూడదు, వారు ఆగ్రహముతో అసహ్యించుకొనునట్లు చేయకూడదు, ఎల్లప్పుడు చూచినా ఏదో ఒక విషయము గూర్చి అసంతుష్టిని వ్యక్తము చేయకూడదు, లేక వారి పిల్లల్లో కోపమును రెచ్చగొట్టకూడదు. పిల్లలను చిన్నబుచ్చుట, ఇతర పిల్లలతో సమానముగా చూడకపోవుట, లేదా వారిని అర్థంచేసికొనుటలో విఫలమగుట వలన పిల్లలు ఎంతో నిరుత్సాహపడుదురు.

తమ పిల్లలకు శిక్షణనిచ్చు విషయములో గతకాలమందు దేవుడు తండ్రులను బాధ్యులనుగా పరిగణించాడు. ఆయన ప్రత్యేకమైన తన జనాంగమునకు అబ్రాహామును తండ్రిగా ఏర్పరచుకొన్నాడు ఏలయనగా ఆయన తరువాత తన సంతానము సహితము దేవుని మార్గములలో నడుచుకొనునట్లు అబ్రాహాము తన సంతానమునకు నేర్పించును (ఆదికాండము 18:19). తన సొంత కుమారుల అవినీతికరమైన ప్రవర్తన విషయములో దేవుడు ఏలీని బాధ్యుడుగా ఎంచాడు (1 సమూయేలు 2:27–29; 3:13, 14). వారు తమ పిల్లలను "ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను" పెంచవలెనని పౌలు తండ్రులకు ఆదేశమిచ్చాడు (ఎఫెసీయులకు 6:4).

పిల్లల భవిష్యత్ జీవితము మరియు జీవిత విధానమును దృష్టిలో ఉంచుకొని వారికి శిక్షణ నిచ్చుట అత్యావశ్యకమైన అంశమై యున్నది. వారు చేయుచుండు పొరపాటును వ్యతిరేకార్థకముగా ఎత్తిచూపించుట అవసరమే, కానీ అలా ఎత్తిచూపించుట మాత్రమే నీ ఉద్దేశమైనట్లయితే, అది వారిని నిరుత్సాహపర్చును. నిర్మాణాత్మకమైన ఆదేశములు మరియు యథార్థమైన మాదిరి జీవితము ద్వారా వారికి జీవిత విధానము నిమిత్తమైన మార్గనిర్దేశనము ఇవ్వబడుచుండవలెను. వారి పిల్లలను యింకా ఎక్కువ ప్రోత్సాహించునట్లు తమ పిల్లలు చేయుచుండు మంచి పనులను గమనించు ఒక మంచి తండ్రి వాటికి ఆమోద ముద్ర వేయుచు తన హర్షమును మరియు సంతృప్తిని వ్యక్తము చేయును.

తలిదండ్రులు వారి పిల్లల శీలము సరైన దిశలో అభివృద్ధిచెందునట్లు వారికి చేయగలుగునట్లు తలిదండ్రులకు సహాయకరముగా నుండు విలువైన సలహాలు సామెతల గ్రంథంలో ఇయ్యబడియున్నవి. (చూడుము 13:24; 19:18; 22:6, 15; 23:13, 14; 29:15, 17.)

తలిదండ్రులు తమ పిల్లలతో వ్యవహరించునప్పుడు మరీ ఎక్కువ కఠినముగా ప్రవర్తించుట లేదా వారిని సరిగా అర్థంచేసికొనకపోవుట వలన పిల్లలు నిరుత్సాహపరచబడినవారౌదురు,

లేక వారి మనస్సు కృంగిపోవును. గ్రీకు భాషలో "మనస్సు కృంగిపోవుట" ఒక్క పదమై యున్నది (*athumeō*), అది క్రొత్త నిబంధనలో ఇచ్చట మాత్రమే కనిపించుచున్నది. ఈ పదము, "ఆత్మవిశ్వాసమును కోల్పోవుట, నిరుత్సాహ పర్చబడుట, లేక ఏదో పోగొట్టుకున్నవానివలె విచారముగా నుండుట" అని కూడ అనువదింపబడవచ్చును. పిల్లల కోమలమయిన హృదయములు సులభముగా బ్రద్దలుచేయబడగలవు, అది పిల్లల మనస్సులకు హానికరమైన ఆత్మన్యూనతా భావమును కలిగించగలదు.

తలిదండ్రుల ప్రయాసమంతా, కేవలము పిల్లలు కొంటెపిల్లలుగా తయారవకూడదను ఉద్దేశముతో మాత్రమే, వారికి శిక్షణ నిచ్చుటపైకేంద్రీకరింపబడి యుండకూడదు. తప్పుడు విషయములను నిర్మూలించుట గూర్చి అతిగా నొక్కివక్కాణించుట వలన పిల్లలు వ్యతిరేకార్థకమైన మనస్సు పెంపొందించుకొందురు. గనుక పిల్లలు వారి ప్రవర్తనలో క్రీస్తును పోలి నడుచుకొనునట్లు, అనగా నిర్మాణాత్మకమైన వైఖరులను ధరించుకొని వ్యతిరేకార్థకమైన వాటిని విసర్జించినవారై ప్రవర్తించునట్లు, వారికి నేర్పించుట తలిదండ్రుల ప్రధాన లక్ష్యమై యుండవలెను. పిల్లలు అనుకరించుటకు వారికి విజయ వీరులు మరియు మాదిరులైన మహా స్త్రీపురుషులు అవసరమై యున్నారు, ఎప్పుడు చూచినా ఏదో ఒక చెడు ప్రవర్తన విషయంలో చివాట్లు పెట్టుచుండుట తగదు. "బాలురు నడువవలసిన త్రోవను వానికి నేర్పుట" (సామెతలు 22:6) వాడు నడువకూడని త్రోవల గూర్చి నేర్పించుటను మించినదై యున్నది. పిల్లలను తప్పుడు మార్గములకు విరోధముగాహెచ్చరించుట కంటెవారికి సరైన దిశను చూపించుట బహుశా అతి ప్రాముఖ్యమైన విషయమై యున్నది.

రోమా సామ్రాజ్యములో, ఒక కుటుంబములోని పిల్లల చావుబ్రతుకుల గూర్చిన అధికారము తండ్రి కలిగియుండెను. ప్రజల జీవితములకు విలువనిచ్చి గౌరవించుచుండిన యేసు, ప్రతి ఒక్కరిని, పిల్లలతో సహా వారి అనుభూతులు మరియు సంక్షేమము గూర్చి అనురాగసహితమైన ఆలోచనా స్థానమునకు హెచ్చించి పైకెత్తాడు. మత్తయి 7:12లోని సూత్రము, పెద్దలకును చిన్నలకును, ప్రతి ఒక్కరికి ఒకే విధంగా వర్తిస్తుంది. పిల్లలు వారియెడల ఎలా ప్రవర్తించవలెనని తలిదండ్రులు కోరుదురో, తలిదండ్రులు సహితము పిల్లల యెడల అదే విధంగా వ్యవహరించవలెను. పౌలు కొలొస్సయులకు 3:8, 9, 12–14లో ఇచ్చిన జాబితా ప్రకారమైన సకల సద్గుణములను తండ్రులు ధరించుకొని, సమస్త దుర్వ్యసనములను విసర్జించినట్లయితే, వారి పిల్లలతో వారు ప్రేమ పూర్వకమైన కనికరముతో వ్యవహరించుచున్నవారౌదురు.

ప్రతి ఒక్కరు ఎవరో ఒకరికి లోబడడియుండవలెను. ప్రజలందరు – భర్తలు, భార్యలు, మరియు పిల్లలు, అందరును ప్రభుత్వమునకు, వారి యజమానులకు, మరియు దేవునికి లోబడవలసినవారై యున్నారు. పిల్లలు వారి తలిదండ్రులకు కూడ లోబడవలెను. దాసులు, యజమానులకు, తలిదండ్రులకు, ప్రభుత్వమునకు, మరియు లోబడవలెను. సమస్త సంబంధములలో లోబడుట మరియు విధేయత చూపుట అనివార్యము; ఈ ప్రతిస్పందనలు ఆత్మన్యూనతా భావము లేదా సామర్థ్యము స్వల్పమైనదను తలంపు కలుగజేయవు.

## యజమానుల యెడల దాసుల ప్రవర్తన (3:22–25)

**[22]దాసులారా, మనుష్యులను సంతోషపెట్టువారైనట్టు కంటికి కనబడవలెనని కాక, ప్రభువునకు భయపడుచు శుద్ధాంతఃకరణగలవారై, శరీరమునుబట్టి మీ యజమానులైనవారికి అన్ని విషయములలో విధేయులైయుండుడి. ప్రభువు వలన స్వాస్థ్యమును ప్రతిఫలముగా పొందుదుమని యెరుగుదురు గనుక, మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి; మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులై యున్నారు. అన్యాయము చేసినవారికి తాను చేసిన అన్యాయముకొలది మరల లభించును, పక్షపాతముండదు.**

### "దాసులారా, ... మీ యజమానులైనవారికి అన్ని విషయములలో విధేయులై యుండుడి" (3:22)

ఒక సొత్తుగా, దాసులకు హక్కులు లేవు. వారి సొంతదారుల ఇష్టాయిష్టముల చొప్పునను, వెఱ్ఱితలంపుల చొప్పునను, అధికార స్వరంతో వారడుగువాటన్నిటి ప్రకారము దాసులైనవారు వారిని సేవించవలసినదే. కొందరు యజమానులు అధికార అహంకారంచేత అవతలివారిని లొంగదీసుకొనుటకు దాసుల యెడల దౌష్ట్యముగా ప్రవర్తించుచుండగా, ఇతరులు వారి దాసులను మర్యాదపూర్వకముగా చూచుకొనుచుండిరి. ఆ యా దాసులతో వారి యజమానులు ఎలా వ్యవహరించినా, క్రైస్తవులైన దాసులు మాత్రం వారి యజమానులకు సరియైనదైన ప్రతి విషయములోను లోబడవలసినవారై (*hupakouō*) యుండిరి.

భార్యలు, భర్తలు, పిల్లలు, తండ్రులు, లేక యజమానుల కంటే, పౌలు దాసులకు అతి విస్తారమైన ఆదేశములు నిచ్చాడు. పౌలు క్రైస్తవ దాసులకు చేసి బృహత్ వినతి యేసుతో గల సంబంధముపై ఆధారపడియుండినది. దాసులకు ఆదేశముల నిచ్చునప్పుడు, వారు సంఘములో బాధ్యతగల సభ్యులైయున్నారని ఆయన వారి యెడల మర్యాద కనుపర్చాడు. ఆయన కేవలము వారు గైకొనవలసిన ఉత్తరువులను మాత్రమే జారీచేయలేదు, కానీ వారు "లోబడవలెను" అని చెప్పుటకు గల హేతువులను ఆయన వివరించాడు. ఆయన దాసుల బాధ్యత గూర్చి ఇతర పత్రికలలో సంబోధించాడు (ఎఫెసీయులకు 6:5–8; 1 తిమోతి 6:1, 2 చూడుము). వారి యజమానులు మంచివారైనా, దుష్టులైనా, దాసులు మాత్రం నమ్మకమైన సేవలందించవలెనని పేతురు రచించాడు (1 పేతురు 2:18–20).

శరీరమునుబట్టి యజమానులైనవారు (*tois kata sarka kuriois*) అనగా, అక్షరాలా "శరీరమునుబట్టి ప్రభువులైనవారు" అని అర్థము. ఈ పదజాలము యేసునకు, అనగా క్రైస్తవుని పరలోక ప్రభువు మరియు యజమానుడైనవానికి, వ్యత్యాసమైనదై యున్నది. "యజమానుడు" అను పదము అతి తరచుగా "ప్రభువు" అని అనువదింపబడి, అత్యంత బాహుళ్యంగా యేసు విషయం ప్రస్తావింపబడినప్పుడు వాడబడినది. క్రైస్తవుడైన దాసుడు క్రైస్తవుడైన యజమాని యెడల కలిగియున్న బాధ్యత ఇహలోక సంబంధమును మించినదై యుండినది, ఏలయనగా వాడు దాసుడు మాత్రమే కాదు కానీ క్రీస్తు నందు ఒక సహోదరుడై యుండెను.

దాసుడు **అన్ని విషయములలో** లోబడవలెను. ఈ పదజాలము అర్థమైన శ్రేణి యొక్క

పరిధి లోపల నుండు అన్ని విషయములు – ఈ సందర్భములో, దేవుని దృష్టిలో సరైన అన్ని విషయములు, అను అవగాహనతో ప్రయోగింపబడింది.

మొదటి శతాబ్దమునాటి సమాజములో దాసత్వము ఆమోదింపబడిన అంశమే. దాసత్వమును పౌలు బహుశా అంత ఎక్కువగా ఆమోదించి యుండకపోవచ్చును; ఎవడైన స్వతంత్రము ఇవ్వబడినట్లయితే వాడు దానిని అంగీకరించవలెనని ఆయన కొరింథీయులకు రచించాడు (1 కొరింథీయులకు 7:21). ఏదిఏమైనా, బానిసత్వమును అంతమొందించుటకు దాసులు మరియు యజమానులు సామాజిక సంబంధమైన విప్లవములలో పాలిభాగస్థులై యుండవలెనని ఆయన ఆజ్ఞాపించలేదు. దానికి బదులుగా, వారి సకల విధములైన సంబంధములను తలక్రిందులు చేయు సూత్రములను నివేదించాడు. ఒనేసిమును యికమీదట దాసునిగా పరిగణించకూడదు, కానీ ఒక క్రైస్తవ సహోదరునిగా వ్యవహరించవలెనని ఆయన ఫిలేమోనుకు వ్రాసిన ఉత్తరములో పౌలు సిఫారసు చేసాడు (ఫిలేమోను 16).

దాసులకు సంబంధించనంత వరకు యేసు చేసిన బోధలు, సంఘములో వారికి సమానత్వమును సమకూర్చి, తత్ఫలితంగా ప్రపంచంలోని అనేక ప్రదేశములలో బానిసత్వమును అంతమొందించినది. యేసు ప్రదర్శించిన ప్రేమ సూత్రము క్రైస్తవులు వారి దాసులు యెడల మంచిగా ప్రవర్తించుచు, వారి యెడల నిర్దయగా వ్యవహరించుటకు బదులుగా వారిని పొరుగువారిగా ఎంచునట్లు వారిని ప్రోత్సాహించినది (రోమీయులకు 13:8–10). ఇతరులు నీ యెడల ఎలా వ్యవహరించవలెనని నీవు కోరుదువో, నీవును వారి యెడల అలాగే ప్రవర్తించవలెనను అభిప్రాయము (మత్తయి 7:12) దాసత్వము రూపుమాపబడునట్లు దోహదము చేసినది.

నేడు దాసత్వము గూర్చిన చర్చ అత్యధిక సమాజములలో అనవసరమైన అంశమై యున్నట్లు కనిపించుచుండగా, దాసుడు–యజమానుడు సంబంధము క్రైస్తవునికి వాస్తవముగా అత్యంత సందర్భశుద్ధిగల శీర్షికలో ఒకటై యున్నది – ఏలయనగా క్రీస్తుతో మనము కలిగియుండవలసిన సంబంధము గూర్చి అదొక సముచితమైన వర్ణనయై యున్నది (కొలొస్సయులకు 4:1; 1 కొరింథీయులకు 7:22 చూడుము). పౌలు తనను గూర్చి తాను లేదా తోటి క్రైస్తవుని గూర్చి తరుచుగా "పూటబడిన" అని ప్రస్తావించుకొన్నాడు (రోమీయులకు 1:1; కొలొస్సయులకు 1:7; 4:7). క్రీస్తు దాసులముగా, దాసుడు–యజమానుడు సంబంధమునకు సంబంధించి పౌలు ఇచ్చిన ఆదేశముల నుండి మనము ఎంతో నేర్చుకొనవచ్చును.

**"మనుష్యులను సంతోషపెట్టువారైనట్టు కంటికి కనబడవలెనని కాక" (3:22)**

కంటికి కనబడు ఉపచారము (*ophthalmodoulia*) గ్రీకు భాషలో ఒకేపదమై యున్నది. "కంటికి కనబడు సేవ" అని అక్షరాలా అర్థమిచ్చు ఈ పదము, ఎఫెసీయులకు 6:6లో కూడ కనిపిస్తుంది. యజమానుని లేక విధినిర్వహణలో క్రమశిక్షణను బాగుగా అమలుచేయజూచువాని మనస్సులో మంచి అభిప్రాయ ముద్ర వేయినట్లు, వానిని యజమానుడు గమనించునప్పుడు మాత్రమే దాసుడు నమ్మకమైనవాడుగా పనిచేయకూడదు కాని యజమానుడు చూడనప్పుడు కూడా నమ్మకముగా పనిచేయుచుండవలెను. అది యేసుకు ప్రీతికరమైనదై యుండవలెనను లక్ష్యము, సేవ చేయుట కొరకు సరైన ప్రోత్సాకమై యుండినది. ప్రతి కార్యభారము ఆయన దృష్టి చొప్పున చేయబడినది, గనుక శాశ్వత బహుమానమును ఆయనే ఇచ్చును. మంచి

దాసుడు కష్టించి పనిచేసినందుకు వాని చేత పొందుకొనబడిన ప్రయోజనము వానికి ఐహిక పారితోషికమును సంపాదించిపెట్టవచ్చును, కానీ పొందుటకు పరలోకాశీర్వాదములు అంత కంటే ఎక్కువ ప్రాముఖ్యమైనవై యున్నవి. క్రైస్తవుడైన దాసుడు మొదట యేసుకు చెందినవాడై యున్నాడు (1 కొరింథీయులకు 7:22), ఆ తరువాతనే ఇహలోక యజమానికి చెందినవాడై యున్నాడు.

మనుష్యులను సంతోషపెట్టుట – దీనికి సంబంధించిన పదము (*anthrōpareskoi*) క్రొత్త నిబంధనలో మరొక్కమారు "మనుష్యులను సంతోషపెట్టువారు" అని కనిపించును (ఎఫెసీయులకు 6:6), ఆయన బోధల గూర్చి వ్రాసినప్పుడు, ఇదే పదమును, వాడబడినప్పటికిని, పౌలు ఈ అభిప్రాయమును చేర్చాడు. ఆయన మనుష్యులను సంతోషపెట్టునట్లు తన సందేశమును మార్చలేదు (గలతీయులకు 1:10; 1 థెస్సలొనీకయులకు 2:4), కానీ తన జీవిత విధానము చేత ఎవరి మనస్సునైనను నొప్పించకూడదని ప్రయత్నించాడు (1 కొరింథీయులకు 10:33).

వానిని తన యజమానుడు గమనించినప్పుడు మాత్రమే లేదా లోబడక తప్పదను అనుభూతి పొందినప్పుడు మాత్రమే దాసుడు తన యజమానునికి సేవ చేయకూడదు. వానిని తన యజమానుడు గమనించినా, గమనించకున్నా లేదా మరొకరు చూచినా చూడకున్నా, వాడు చేయుచుండిన పనులు వాని మనస్ఫూర్తిగా చేయబడుచుండినవై యుండవలెను.

"కాదు" (*mē*) "కానీ" (*alla*) – ఒక గ్రీకు నుడికారమై యున్నది, అది ఒక వాక్య నిర్మాణములోని మొదటి సగభాగమును పూర్తిగా మినహాయించదు కానీ రెండవ సగభాగమును ఉద్ఘాటించును. "మొదటిది, రెండవదానంతటిది కాదు" అని దానిని అర్థం చేసికొనవలెను. వారి యజమానులను సంతోషపెట్టుటలో, దాసులు ప్రయత్నించకూడదని పౌలు చెప్పుచుండలేదు; విశేషంగా, యేసును సంతోషపెట్టుట వారి ప్రథమ ప్రాధాన్యతయై యున్నదని చెప్పుచుండెను. ఇందునుబట్టియే, ఇప్పటివరకూ ఆధునికము చేయబడిన NASB అనువాదము యొక్క కూర్పులో, "కేవలము మనుష్యులను సంతోషపెట్టువారుగా మాత్రమే గాక" అని వ్రాయబడి యున్నది. "కేవలము" అను పదము గ్రీకు వాక్యభాగములో లేనప్పటికిని, గ్రీకు నుడికారము చేత దాని అంతరార్థము ఇలా భావింపబడినది.[4]

ఏదైన ఒక ఆజ్ఞకు లోబడవలెను కదా మరియు మనుష్యులను సంతోషపెట్టవలెను కదా అను ఉద్దేశముతో పనులు చేయుట బొత్తిగామానివేయాల్సిన అభ్యాసములు కావు. కానీ ఒకనికి ఉపచారము చేయవలెను లేక ఒకనిని సేవించవలెనను ఆలోచన, మనుష్యుల కంటికి కనుపర్చి వారిని సంతోషపెట్టవలెనను కోరిక కంటె, అది దేవుని యెడల గల భయభక్తి మూలమున వాని అంతరంగములో అంకురించిన ఆశయై యుండవలెనని పౌలు చెప్పుచుండెను.

### "ప్రభువునకు భయపడుచు, శుద్ధాంతఃకరణగలవారై" (3:22)

దాసులు వారి యజమానుల యెడల ప్రదర్శింపవలసిన మర్యాద క్రీస్తు ఆధిపత్యమును గుర్తించుటపై ఆధారపడవలెను. దాసులకు రెండు రకములైన ప్రభువులుండిరి – ఇహలోక ప్రభువులు (*kurioi*, "యజమానులు") మరియు పరలోక ప్రభువు (*kurios*). ఈ రెండు పదములు కూడ ఒకేగ్రీకు పదము నుండి పుట్టినవే, కానీ ఒకటి బహువచనమై యుండగా,

రెండవది ఏకవచనమై యున్నది. వారి ప్రభువును – అనగా, దేవుని – సంతోషపెట్టుటకు దాసులు మనస్ఫూర్తిగా చిత్తశుద్ధిగల సేవ చేయాల్సి వుండినది. మానవ హృదయము ఒకని అంతరంగ ఉనికికి కేంద్రమై యున్నది, దానిలో ఆలోచన, భావోద్రేకము, మరియు చిత్తము కలిసి యున్నవి. మనస్ఫూర్తి (*haplotēs*) – ఇదే భావంతో మరొక చోట అగుపించును (2 కొరింథీయులకు 1:12; ఎఫెసీయులకు 6:5). సంబంధిత గ్రీకు పదము "సరళత" అని 2 కొరింథీయులకు 11:3లో అనువదింపబడినది, మరియు ఇతర వాక్యభాగములలో అది "ఔదార్యము" అను భావమును తెలియజెప్పుచున్నది (రోమీయులకు 12:8; 2 కొరింథీయులకు 8:2; 9:11, 13).

గ్రీకు లేక రోమా సామ్రాజ్యములోని దాసులు ఏక తాత్పర్యముతో కూడిన అవిభక్తమైన స్వామిభక్తి కలిగియుండవలసివారై యుండిరి. దాసుడు వాని యజమాని సొత్తై యుండెను. వానికి ఒక సొంత దాసుడున్నట్లయితే వాడు ఎటువంటి ఉపచారము చేయవలెనని ఆశించునో, అటువంటి సేవలనే వాడు సహితము వాని యజమానునికి చేయవలెను.

భయపడుచు – సంబంధిత గ్రీకు పదము, *phoboumenoi,* దేవుని విషయములో ప్రయోగింపబడినప్పుడు, అది "గౌరవప్రదమైన పూజ్యాభావము" అని అనువదింపబడవలెను, భయోత్పాతముతో లేక అమితమైన భయముతో కూడిన అని కాదు. వారు తమ యజమానులకు భయముతో సేవచేయవలెనని దాసులకు, వారు భయముతో దేవుని సేవించవలెనని భార్యలకు, తన ఆదేశములను జారీ చేయుచుండినప్పుడు పేతురు ఈ పదము యొక్క రూపమును ఉపయోగించాడు (1 పేతురు 2:18; 3:2 చూడుము). ఇహలోక యజమానుడు మర్యాద ఇవ్వబడవలసినవాడై యుండెను. అలాగైతే, దేవునికి మరి ఎక్కువ మర్యాదనీయవలెను, ఏలయనగా అంతిమమైనది మరియు గొప్పదైన బహుమానమునిచ్చువాడు ఆయనే.

> అయితే క్రైస్తవ దాసుడు ... విశ్వసనీయముగాను మనస్ఫూర్తిగాను తన విధులను నిర్వర్తించు నిమిత్తము ప్రోత్సాహకములన్నిలోని అత్యున్నతమైన వాటిని కలిగియుండెను; వాడు క్రీస్తు దాసుడొకడు కలిగియుండు వాటన్నిటిని మించినవాడై యుండెను, గనుక వాడు మొట్టమొదట ఆయనను సంతషపెట్టునట్లు వాని పనులు చేయును. ఇహలోక యజమానుని భయము కాదు, కానీ "ప్రభువైన క్రీస్తు" యెడల గల భక్తిపూర్వకమైన భయము ప్రాథమిక ప్రోత్సాహకమై యుండవలెను. వారు కఠోరమైన, నీతిలేని, మరియు విశ్వాసఘాతుకమైన యజమానుని యెడల సహితము ఆసక్తితోను, ఆతురతతోను పనులు చేయునట్లు ఇది క్రైస్తవ దాసులను ప్రోత్సాహించును; ఏలయనగా వారు కృతజ్ఞతనుగాని బహుమానమునుగాని ఈ యజమానుని నుండి ఆశించరు కానీ క్రీస్తు నుండి లభించునని ఎదురుచూచుచుందురు.[5]

ఏ సందర్భములోనైనను "భయముతో" దేవుని సేవించవలెనను అభిప్రాయము, ప్రేమ భయమును వెళ్లగొట్టునను ఉపదేశమును నిరాకరించుటలేదు. "ప్రేమ" భయమును వెళ్లగొట్టును అని వ్రాయలేదు, కానీ "పరిపూర్ణమైన ప్రేమ" భయమును వెళ్లగొట్టునని యోహాను వ్రాసాడు (1 యోహాను 4:18). "పరిపూర్ణమైన ప్రేమ" కలిగియుండువాడు పరిపూర్ణమైన విధేయతను కూడ ప్రదర్శించును. ఏలయనగా వాడు లోబడునట్లు వానికి ప్రేరకమును సమకూర్చు బలమైన ప్రోత్సాహకము ప్రేమయై యున్నది (యోహాను 14:15, 21, 23; 1 యోహాను 5:3). "దేవుని వాక్యము గైకొనువానిలో" ప్రేమ "నిజముగా పరిపూర్ణమాయెను" (1 యోహాను 2:5). మనము అప్పుడప్పుడు పాపము చేయుచుందుము

(1 యోహాను 1:8, 10); కాబట్టి, మనలో పరిపూర్ణమైన ప్రేమ లేదు. అందుచేతనే మనము భయము కలిగియున్నాము. క్రైస్తవులు పాపము చేయకుండునట్లును, వారు దేవుని యెడల అవిధేయులు కాకుండునట్లు సరియైన భయము వారిని కాపాడును (హెబ్రీయులకు 10:27, 31).

**"మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువునిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి" (3:23)**

దాసుడు దేవుని కొరకు పనిచేయుచున్న వాని వలె పనిచేయవలసి యుండెను. మనస్ఫూర్తిగా (*ek psuchēs*, అక్షరాలా, "ఆత్మలో నుండి") అను మాట కొలొస్సీ పత్రిక ఇచ్చట మాత్రమే కనిపించును. దేవుని యెడల గల భక్తిమర్యాద మరియు సేవచేయవలెనను అంతరంగములోని కోరికనుబట్టి, దాసులు వారి యజమానులకు నమ్మకముగా లోబడవలసినవారై యుండిరి. ఇది వారి వ్యక్తిగత కీర్తిని నలుదిశల వ్యాపింపజేయుట మాత్రమే గాక, ఒక వైపు యేసు నామమునకు మహిమ కలుగజేస్తుంది, మరొక ప్రక్క క్రైస్తవ్యమునకు గౌరవమును సమకూర్చుతుంది. దేవునినే సంతోషపర్చునట్లు పనులు చేసినవారు, వారి ఇహలోక యజమానులకు సహితము, సంతోషపర్చలేరని అనుకున్న దాని కంటె ఎక్కువగా సంతోషపర్చడం జరుగుతుంది. అంకిత భావముతో సేవచేసినప్పటికిని, ఒకడు ఇహలోక యజమానుని నోటి ద్వారా చీవాట్లు పొందినను, పరలోక యజమాని వాని గూర్చి సంతోషించుచు నమ్మకమైన ఆ దాసునికి తగిన బహుమానముగా పరలోక స్వాస్థ్యము నిచ్చును (1 పేతురు 1:3, 4).

ఒక దాసుడు వాని యజమానునికి లోబడవలసి యున్నప్పటికిని, వాని ఇహలోక యజమాని కంటె యేసునే ఎక్కువగా సంతోషపర్చునట్లు వాడు సకల విధముల ప్రయాసపడవలెను. ఒక దాసుడు యేసు క్రీస్తును స్వరక్షకునిగా స్వీకరించిన తరువాత, వాడు ఒక నూతనమైనదియు, భిన్నమైనదియునైన దృక్పథముతో సేవించవలెను. సాధ్యమైనట్లయితే, వాడు స్వేచ్ఛను పొందవలెను; లేదంటే, వాడు పిలువబడిన సామాజిక స్థానమును వాడు అంగీకరించవలెను (1 కొరింథీయులకు 7:20, 21). ఒకడు దాసుడైయున్నంత కాలము, దేవుని సేవించుచున్నవాడుగా, వాడు తన యజమానుని ఇష్టపూర్వకముగా సేవించవలెను. వాడు పూర్తి ప్రావీణ్యముతో సేవచేయుటకు వెదకుచు, వాని శాయశక్తులా సేవచేయవలెను. దేవుని సేవించుచున్నట్లు, వాడు విశిష్టముగా సేవ చేయుటకు ఆశించుట వలన, వాడు చేయుచున్నంత చక్కగా పరిచర్య చేయని ఇతర దాసుల యెదుట వాడు విలక్షణమైనవాడుగా నిలువబడును. ఇలా చేయుట వలన వాని యజమాని అనుగ్రహపూర్వక గుర్తింపు మరియు వాని సామాజిక గౌరవమర్యాదలు లభించును. అంతమాత్రమేగాక, వాడు ఇతరులకు ఒక చక్కని మాదిరియై యుండును.

క్రైస్తవేతర దాసులు వారి యజమానులను సంతోషపర్చవలెనను ఉద్దేశముతో అందుకు తగిన విధంగా పనులు చేసియుండవచ్చును, కానీ వారు యేసును సంతోషపర్చవలెనని చేయలేదు. క్రైస్తవుడైన దాసుడు, యేసునే సంతోషపర్చవలెనను ఉద్దేశముతో పనులు చేయును, గనుక వాని ఇహలోక యజమానుని సహితము వాడు సంతోషపర్చును, క్రైస్తవుడైయున్న పరిచర్య చేయవలసిన యజమాని క్రైస్తవుడైనా క్రైస్తవేతరుడైనా, వాడు ఉపచారము చేయుటలో

నుండు ఉత్సాహము, ఉద్దేశము ఒకటే అయియుండవలెను.

### "ప్రభువు వలన స్వాస్థ్యమును ప్రతి ఫలముగా పొందుదుమని యెరుగుదురు" (3:24)

వాని పరలోక **ప్రతిఫలము**, వాని యజమానుడు ఇవ్వగల ఏ ఇహలోక ప్రతిఫలము కంటెను గొప్పదైయున్నదనునది దాసుడు దేవునికి ఉపచారము చేయునట్లుగా పనులు చేయుచుండవలెనని చెప్పుటకు గల హేతువై యున్నది. నమ్మకమైన క్రైస్తవ దాసుడు, **దేవుడు వాగ్దానము చేసిన స్వాస్థ్యమును** ప్రతి ఫలముగా పొందునను అభయము కలిగియుండెను.

ఈ "స్వాస్థ్యము" (*klēronomia*) – అది ఒకడు ఆర్జించిన జీతము కాదు, కానీ వంశానుగతంగా పొందుతున్న ప్రతిఫలమై యున్నది. కొన్ని ప్రతిఫలములు ఆర్జింపబడునవై యున్నప్పటికిని, ఇతరమైనవి వాటిని ఇచ్చువాని ఉదారత ఆధారంగా ఇవ్వబడినవి. దాసులైనవారిలో అధిక సంఖ్యాకులకు ఇహలోక స్వాస్థ్యము గూర్చిన నిరీక్షణ లేకుండినది, ఏలయనగా స్వాస్థ్యము సాధారణంగా స్వతంత్రులైనవారి కొరకు దాచబడియుండినది; కానీ వారు పరలోక స్వాస్థ్యమును పొందుకొందురను నిరీక్షణ నమ్మకమైన క్రైస్తవ దాసులు కలిగియుండిరి. క్రీస్తునందలి, సమానత్వము మూలమున, ఇతర క్రైస్తవుల వలనే వారు కూడా అదే స్వాస్థ్యమును పొందుకొందురని దాసులు ఎదురుచూడవచ్చును. వారు "తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యమును" పంచుకొందురు (కొలొస్సయులకు 1:12).

ద్రాక్షా తోటను కాపుకాయుచుండి, యజమానుని యొక్క కుమారుని స్వాస్థ్యమును స్వాధీనం చేసికొనునట్లు ఆ కుమారుని చంపిన కొందరి గూర్చిన ఒక ఉపమానమును యేసు చెప్పాడు (మత్తయి 21:33–40; మార్కు 12:1–11). క్రైస్తవ స్వాస్థ్యము పొందుకొనబడు విధానము ఇది కాదు. సరికదా, దానిని ఎవరును ఆర్జించలేరు. పరలోకమందలి నిత్య జీవము, రక్షణ వలె, ఒక వరమై యున్నది (అపొస్తలుల కార్యములు 20:32; ఎఫెసీయులకు 2:8, 9). ఇంతేగాక, అది తిరిగి జన్మించినవారికి (యోహాను 3:3–5; 1 పేతురు 1:3, 4), దేవుని కుమారుల వలె (రోమీయులకు 8:17; గలతీయులకు 4:7) శాశ్వతమైనదియు, ఎన్నటికినీ అంతముకానిదై యున్నది (హెబ్రీయులకు 9:15). ఒకడు విశ్వాసము మరియు బాప్తిస్మమువలన దేవుని బిడ్డ యగును, గనుక అవి వాగ్దానము ప్రకారము ఒక వారసునిగా చేయును (గలతీయులకు 3:26, 27, 29).

స్వాస్థ్యములు సాధారణంగా ఒక యజమానుని పిల్లల కొరకు దాచబడి యుండినవి. అదొక అసాధారణమైన అంశమై యుండినప్పటికిని, ఒక యజమానుడు తన దాసుడైనవానికి ఒక స్వాస్థ్యమును ఇచ్చుట, సాధ్యమైనదై యుండినది. ఏదైన ఒక ఇహలోక ఆస్తి స్వాస్థ్యముగా పొందుకొనబడునను వాగ్దానము, దాసుడు మరి ఎక్కువ శ్రద్ధాళువుతో పనిచేయుటకు వానికి ఒక ప్రోత్సాహకమై యుండినది. అంత కంటె గొప్పదైన నిరీక్షణ క్రైస్తవ దాసుడు కలిగియుండెను, ఏలయనగా ఒక యజమానుడు ఇవ్వగల ఇహలోక వరము ఏదైనను దాని విలువ కంటే అత్యధిక విలువగలదై ఒక స్వాస్థ్యమును పొందుకొనగలడను నిరీక్షణ వానికుండినది. దాసుడు, దేవుని కుమారుని వలె, క్రీస్తు వలన స్వతంత్రుడై యుండెను (1 కొరింథీయులకు 7:22), ఏలయనగా దాసునికిని యజమానునికిని మధ్య నుండిన విలక్షణత క్రీస్తునందు మటుమాయమయ్యింది. క్రైస్తవ దాసుడు పరలోక స్వాస్థ్యము యొక్క

నిరీక్షణతో, దేవునితో నిరంతరము జీవించుటకు ఒక తరుణము కలిగియుండి, దేవునివారసుడై యుండెను (గలతీయులకు 3:26-29; 4:7). పరలోకము, ప్రతి క్రైస్తవ విశ్వాసి యొక్క నిరీక్షణయై యున్నది (కొలొస్సయులకు 1:5; ఎఫెసీయులకు 4:4; 1 పేతురు 1:3, 4).

తండ్రి నుండి పొందుకొనిన స్వాస్థ్యము అది పుడమిపై నున్న ఒక స్థలమై యుండదు, ఈ భౌతిక భూమ్యాకాశములు గతించిపోవునని యేసు బోధించాడు (మత్తయి 24:35). అవి కాలిపోయి లయమగునని పేతురు రచించాడు (2 పేతురు 3:10), మరియు తీర్పు సన్నివేశములో భూమ్యాకాశములు గతించిపోయినవని యోహాను రచించాడు (ప్రకటన 20:11; 21:1).

ఏదైన ఒక స్వాస్థ్యము ఒక ప్రతిఫలముగా ఇయ్యబడునే కానీ అది ఏదో ఆర్జింపబడిన ఒక విషయముగా కాదు. ఈ హేతువుబట్టియే, రక్షింపబడిన ప్రతి ఒక్కడు అదే ప్రతిఫలమును పొందుకొనును. వ్యక్తిగత యోగ్యతనుబట్టి పరలోకమును సంపాదించుకొనదగినట్లయితే లేక పరలోకమునకు యోగ్యుడైనట్లయితే, అది జరుగని పని (ఎఫెసీయులకు 2:8, 9), ప్రతిఫలములకు పరిమాణములుండునని ఆశించవచ్చును. ఒకడు యేసు కొరకు చేయగలిగినదానంతటిని చేసిన తరువాత కూడ, వాడు యింకను అయోగ్యుడును అప్రయోజకుడునైయున్నాడు (లూకా 17:7-10). యేసు యొక్క యోగ్యత ద్వారా మాత్రమే ఎవడైనను రక్షింపబడును. వారు తమ జీవితకాలమంతా సేవచేసినవారైతేనేమి, వారి అంతిమ రోజుల్లో మాత్రమే సేవచేసినవారైతేనేమి, ఇరువురును ఒకే ప్రతిఫలము పొందుకొందురు (మత్తయి 20:1-16). పరలోకములో ప్రతి ఒక్కరును అదే హోదా మరియు అదే సమానత్వము కలిగియుందురు.

### "మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులై యున్నారు" (3:24)

మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులై యున్నారు అని పౌలు వ్రాసినప్పుడు, ఆయన బహువచనంలో నున్న క్రియను (*douleuete*) ప్రయోగించాడు. ఆయన దాసులను సంబోధించుచుండెను. దాసులు జాగ్రత్తపరులుగా వారి సేవలనందించుటకు గల హేతువు కేవలము ఇహలోక యజమానులను, లేక "ప్రభువులను" సంతోషపెట్టుట మాత్రమే కాదు, కానీ అంత కంటే అతి గొప్పవాడైన ప్రభువును, ప్రభువైన యేసు క్రీస్తును సంతోషపర్చుటయై యుండెను. ప్రభువైన యేసు ఇతరులకు పరిచర్య చేసినట్లుగా, ఇతరులకు పరిచర్యచేయువారు అత్యంత గొప్పవారై యున్నారని యేసు బోధించాడు (మత్తయి 20:25-28). ఆయన తీర్పు సింహాసనముపై ఆసీనుడైయున్నప్పుడు, ఆయనకు కుడి చేతి వైపున ఉన్నవారు నిత్య జీవము పొందుకొందురు ఏలయనగా వారు ఇతరులకు ఉపచారము చేసారు, తద్వారా ఆయనకు చేసారు (మత్తయి 25:31-40). దాసులు ఇహలోక యజమానులకు పరిచర్య చేయుట ద్వారా, యేసుకు కూడ పరిచర్య చేసినవారౌదురు.

పౌలు ఈ ఆదేశములను దాసులకు వ్రాసియుండగా, ఒకడు మరొకనికి ఉపచారము చేయునని ఒప్పుకొన్నాడు, గనుక మరొకరికి ఉపచారము చేయుటకు బద్ధులైయున్న ఎవరినైనను దాసులలో చేర్చుటకు ఇవి మరి ఎక్కువ విస్తృతముగా అన్వయింపబడవలెను. పనిచేయువారు చేయుటకు పని ఇచ్చిన యజమాని కొరకు వాని మనస్సాక్షికి లోబడుచున్నవాడై, వాడు ప్రభువు కొరకు పనిచేయుచున్నవాని వలె పనిచేయవలెను. ఏ నాటి జీవితమునకు సరిపడు

పనిని ఆ నాడు యజమానికి చేసిచూపించవలెను. "మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో, ఆలాగుననే మీరును వారికి చేయుడి" అని యేసు చెప్పిన వాంగ్మూలము ఈ సందర్భములో సముచితముగా వర్తించుచున్నది (మత్తయి 7:12). దైవభక్తిగల దాసుని లక్ష్యము, మొదటిగా, యేసును సంతోషపెట్టుట; రెండవదిగా, వాని యజమానుని సంతోషపెట్టుట; మూడవదిగా, వాడు చేయు పనిలలో వ్యక్తిగత సంతృప్తి కలిగియుండునట్లు శ్రమించి పనిచేయుటయై యుండవలెను (గలతీయులకు 6:4).

## "అన్యాయము చేసినవానికి తాను చేసిన అన్యాయము కొలది మరల లభించును, పక్షపాతముండదు" (3:25)

దాసుడు – మరియు ఇతరులు యింకెవరైనను, యజమానునితో సహా – అన్యాయము చేయువాడు చేసిన అన్యాయము కొలది దానిపర్యవసానములను అనుభవించును. ఈ సందర్భములో పౌలు దాసుల గూర్చి మాత్రమే భావించియుండినట్లయితే, "మీరు" ("దాసులు") అని దీనికి ముందటి వచనములలో వ్రాసిన దానికి అంగీకృతముగా నుండునట్లు "అన్యాయముచేయు" మీరు (బహువచనము) అని రచించేవాడే. దానికి బదులుగా, **అన్యాయము చేసినవానికి** (ఏకవచనము) అని వ్రాస్తున్నాడు, అనగా "ఎవరైనను – దాసుడు, యజమానుడు, లేదా యింకెవరైనను – అన్యాయముచేయువాడు" చేసిన అన్యాయపు చర్యలకు తగిన పర్యవసానములను పొందునని ఆయన భావిస్తున్నాడు.

వెనువెంట నున్న సందర్భములో, దాసులు వారి యజమానుల యెడల కనుపర్చు అవిధేయత లేక అగౌరవము ఆ అన్యాయమై యుండెను. ఏది ఏమైనా, (అన్యాయముచేసిన) "వాడు" (ఏకవచనము) అని వ్రాయుట వలన, పౌలు ఈ పదమును విస్తృతముగా అన్వయించుచున్నాడు, అన్యాయము చేయు ప్రతి ఒక్కరిని ఈ జాబితాలో చేర్చుచున్నాడు. యేసు తన అపొస్తలులకు బోధించినప్పుడు కూడ ఇదే ఆలోచనను వారికి తెలియజెప్పాడు. ఆయన తన శిష్యులతో కూడ ఉండినప్పుడు, ఆయన ప్రభురాత్రి భోజనమును[6] వ్యవస్థాపించాడు. ఈ ఏర్పాటులో, ఆయన తన శిష్యులతో సూటిగా మాటలాడుచు, "మీరు" అని సెలవిచ్చాడు (యోహాను 14:19, 20); కానీ "వాడు" అని ఆయన చెప్పినప్పుడు (యోహాను 14:21), ఆయన ఎవరైనను అని ఉద్దేశించాడు. యోహాను 14–16 అధ్యాయములలో వ్రాయబడియున్న సుదీర్ఘ సంభాషణంతటిలో ఆయన ఇదే చెప్పాడు మరియు భావించాడు.

"అన్యాయము" చేయుట గూర్చి పౌలు ఫిలేమోనుకు వ్రాసిన పత్రికలో కూడ పేర్కొన్నాడు (18 వచనము). దేవుని చిత్తమునకు విరుద్ధమైన ఏ చర్యయైనను ఈ కోవకు చెందినదై యుండును. ఎటువంటి పక్షపాతమైనను చూపకుండా (రోమీయులకు 2:6–11), మనుష్యులు చేయు ప్రతి అనుచితమైన చర్యకు యేసు తీర్పు తీర్చును (2 కొరింథీయులకు 5:10). (పాపమునకు, దుష్క్రియలకు) ప్రతిఫలముగా లభించెడి శిక్ష దేవుని నిత్య నియమమై యున్నది. ఆయన ఇశ్రాయేలీయులతో వ్యవహరించినప్పుడు, "... ప్రతి అతిక్రమమును అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొందియుండెను" (హెబ్రీయులకు 2:2; ద్వితీయోపదేశకాండము 10:17 చూడుము). "మనుష్యుడు ఏమి విత్తునో, ఆ పంటనే కోయును" (గలతీయులకు 6:7).

మనము చేయు చిత్తశుద్ధితోకూడినదియు శ్రద్ధాళువుగలదైన పరిచారమునకు

రెండు కారణములివ్వబడి యున్నవి: ఆయనను సేవించువారికి యేసు పరలోకమందలి స్వాస్థ్యమునిచ్చును, అన్యాయము చేయువారిని ఆయన శిక్షించును. ఆయనకు విధేయత చూపుట వలన ప్రతిఫలము లభించును (హెబ్రీయులకు 5:8, 9), కానీ ఆయన చిత్తమును ఉల్లఘించుట వలన తప్పనిసరిగా శిక్షింపబడవలెను (2 థెస్సలొనీకయులకు 1:6–9).

**"పక్షపాతముండదు" (3:25)**

దేవుడు ఎవరి యెడలైనను ప్రత్యేక అనుగ్రహమును చూపించడు. ఆయన **పక్షపాతము చూపకుండా** తీర్పు తీర్చును (అపొస్తలుల కార్యములు 10:34; రోమీయులకు 2:6, 11; 1 పేతురు 1:17). దాసులకుచ్చినట్లే, పౌలు ఇదే హెచ్చరికను యజమానులకిచ్చాడు (ఎఫెసీయులకు 6:9) ఇదే ప్రమాణము ప్రకారము, ఒకడు కలిగియున్న ధర్మశాస్త్రము ననుసరించుచు, యేసు ప్రతి ఒక్కరికి తీర్పు తీర్చును. ఇశ్రాయేలీయులు పాత నిబంధనలో ధర్మశాస్త్రము క్రిందనుండిరి గనుక వారికి ధర్మశాస్త్రము ప్రకారము తీర్పు తీర్చబడును (రోమీయులకు 2:12). ధర్మశాస్త్రము క్రింద లేని అన్యజనులు మనస్సాక్షి యను నియమము చొప్పున తీర్పు తీర్చబడుదురు (రోమీయులకు 2:14, 15). క్రొత్త నిబంధన, యేసు తన మరణము ద్వారా ప్రతిష్ఠించినది (హెబ్రీయులకు 9:15–17), కలిగియుండి దాని ప్రకారము జీవించువారికి, యేసు బోధల ననుసరించి తీర్పు తీర్చబడును (యోహాను 12:48). ప్రతి ఒక్కరికి వారికి కలిగియుండు ప్రమాణము ప్రకారము తీర్పు తీర్చబడును, గనుక ఏ ఒక్కరైనను ఇతరులకు లేని, లేక ఇతరులను మించిన ప్రత్యేక పరిగణ కోసం లేక కృప కొరకు ప్రాకులాడనవసరం లేదు, ఆశించనూకూడదు. ప్రత్యేకముగా పరిగణింపబడుటకు వారు యోగ్యులని నమ్మువారు కృప యొక్క ఆత్మను అవమానపర్చువారగుదురు (హెబ్రీయులకు 10:29).

తీర్పు దినాన, తీర్పు నిమిత్తము పాటింపబడు ప్రమాణము, ఒకని పరువుప్రతిష్టలు లేక సమాజములో వానికున్న హోదానుబట్టి ఉండదు. పైపై ముఖకవళికలు, సిరిసంపదలు, సామర్థ్యములు, ఆర్థిక స్థోమత, మరియు ఇతరమైన వ్యక్తిగత అనుకూలతలు దేవుడు ఒకనికి ప్రత్యేక కృప చూపించునట్లు ఆయనను ఏమాత్రమును ఒత్తిడిచేయజాలవు. దాసులు, యజమానులు, మరియు ఇతరులందరును దేవుని దృష్టికి సమాన స్థాయిలో నుందురు. దేవుడు ప్రతి ఒక్కరి యెడల ఒకే విధముగా ప్రవర్తించును గనుక ఏ ఒక్కరును ఇతరులెవరి కంటెను ఎక్కువైన లేక ప్రత్యేకమైన అనుగ్రహము కొరకు ఆశించలేరు.

## దాసుల యెడల యజమానుల ప్రవర్తన (4:1)

**1 యజమానులారా, పరలోకములో మీకును యజమానుడున్నాడని యెరిగి, న్యాయమైనదియు ధర్మానుసారమైనదియు మీ దాసుల యెడల చేయుడి.**

**"యజమానులారా, పరలోకములో మీకును యజమానుడున్నాడని యెరిగి, న్యాయమైనదియు ధర్మానుసారమైనదియు మీ దాసుల యెడల చేయుడి" (4:1)**

గ్రీకు పదము *kurioi,* ("ప్రభువులు"; 3:22 చూడుము), యజమానులు అని

బహువచనములో అనువదింపబడి యున్నది, కానీ అది ఏక వచనములో, యేసును సూచించుచున్నందున "ప్రభువు" అయియున్నది (1:3, 10; 2:6; 3:13, 17, 18, 20, 23, 24; 4:7, 17). అత్యంత ఆదికాలము నాటి క్రైస్తవులు ఐశ్వర్యవంతులు కారు, వారిలో అనేకులు దాసులై యుండిరి. కాబట్టి, తారతమ్యమునుబట్టి వారిలో కొద్ది మందికి మాత్రమే దాసులుండియుందురు. దాసులుండిన యజమానులకు పౌలు విస్తృతమైన ఆదేశములు ఇవ్వని హేతువు ఇదే అయియుండును.

దాసునికి యిద్దరు ప్రభువులు లేక యజమానులుండిరి, ఒకరు ఇహలోక యజమాని, మరియొకరు పరలోకమందలి యజమాని. దాసులు యజమానుల సొత్తుగా పరిగణింపబడుచుండిరి, గనుక సొంతదారులు లేక విధినిర్వహణలో క్రమశిక్షణను బాగా అమలుచేయజూచు వ్యక్తులు కొన్ని పర్యాయములు దాసులతో మానవుల వలె గాక జంతువులవలె వ్యవహరించారు. ఆనాడు అమలులో ఉండిన దాసులకు ఎటువంటి సంరక్షణను సమకూర్చలేదు కానీ వారు అప్రధానమైన సొత్తుగా, పనికిరానప్పుడు బయట పారవేయబడదగు వస్తువులుగా యజమానులకు దాసులపై అధికారమునిచ్చినది.

క్రైస్తవ యజమానులు దాసులు గూర్చి ఆందోళనచెందుచున్నవారై వారికి న్యాయమైనది మరియు ధర్మానుసారమైనది చేయువలసినవారై యుండిరి *dikaios* ("న్యాయము") అను పదము యొక్క రూపములు "సరియైన" (ఫిలిప్పీయులకు 4:8) మరియు "నీతిమంతమైన" (రోమీయులకు 3:10) అని అనువదింపబడినది. "సముచితము" (*isotēs*) – క్రొత్త నిబంధనలోని ఇతరమైన రెండు వచనములలో కనిపించుచున్నది (2 కొరింథీయులకు 8:13, 14), అచ్చట అది సరైన సమతుల్యములో ఉండునట్లు చూడబడుచున్నదను భావముతో "సమానత్వము" అని అనువదింపబడినది. ఈ రెండు పదములు "మరియు" అను పదముతో కలుపబడిన యెడల, యజమానులు వారిదాసుల గూర్చి ఆలోచించెడువారై వారి యెడల ఏది న్యాయమైనదో, ఏది సహేతుకమైనదో అదే చేయుచుండవలెనని అర్థమిచ్చును. యజమానులు వారి దాసులను వారితో సమానులుగా, సాటి మానవులుగా ఎంచవలెనని పౌలు చెప్పియుండవచ్చును. ఇదొక విప్లవాత్మకమైన భావమై యుండినది. నిశ్చయముగా, దాసులు స్వతంత్రులతో సహా సమాన హక్కులు కలిగియున్నవారి వలె వ్యవహరింపబడుట, లేక దాసులు యజమానులకు ఏమి చేయవలెనని వారు కోరుదురో వారును దాసులకు ఆలాగుననే చేయుట ఒక సామాన్య వాడుక కాదు. అట్లయినప్పటికిని, యేసు చేసిన అతిముఖ్యమైన ఈ ప్రబోధము – ఇతరులు వారికి ఏమి చేయవలెనని వారు కోరుదురో వారు కూడ ఇతరులకు ఆలాగుననే చేయుట (మత్తయి 7:12) – యజమానులకు సహితము అన్వయింపబడినది.

వారి దాసులను వారు విడుదల చేసి వారిని స్వతంత్రులను చేయవలెనని పౌలు యజమానులకు నిర్దిష్టముగా ఆజ్ఞాపించలేదు. పౌరసంబంధమైన చట్టములు దీనిని కోరలేదు, క్రైస్తవత్వము ప్రభుత్వమును దిక్కరించలేదు. ఏదిఏమైనా, పులియబెట్టు పదార్థము గట్టిగా తడిపి పెట్టబడిన పిండితో కలుపబడినప్పుడు ఆ పిండిన సహితము ఏ విధంగా పులియబెట్టునో, అలాగే క్రీస్తు నియమములు సమాజమును ప్రశాంతంగా ప్రభావితం చేసాయి. ఒక వ్యక్తిలోనైతేనేమి, సంఘములోనైతేనేమి, సమాజములోనైతేనేమి మార్పు తెచ్చుటకు యేసు ప్రయోగించిన పద్ధతి బాహ్య బలము/బలవంతము లేదా సామాజిక విప్లవము కాదు. యేసు

సూక్తులు విప్లవాత్మకమైనప్పటికిని, అవి సామాజిక మార్పుగా మారు అంతరంగమందలి మార్పులను మాత్రమే కలుగుజేయును. యజమానులు వారి దాసులతో మానవత్వంగల మనస్సుతో వ్యవహరించవలెనని యేసు ఇచ్చిన ప్రోత్సాహము వలననే, యజమానులనేకులు వారి దాసులను స్వతంత్రులనుగా చేసారు.

క్రీస్తు దాసుల వలె, వారికి కూడా **పరలోకమందు ఒక యజమానుడున్నాడని** దాసులను కలిగియుండిన క్రైస్తవ యజమానులు వారి మనస్సులో ఉంచుకొనవలసినవారై యుండిరి. దాసులు వారికి లోబడుచు వారిని సంతోషపెట్టవలెనని వారు కోరిన విధముగానే, ఈ యజమానులు క్రీస్తును సంతోషపెట్టుటకు ప్రయత్నించవలెను. వారి దాసులు చేయుచుండిన వారు నిరంతరముగా గమనించలేకపోయారు, కానీ పరలోకమందలి వారి యజమానుడు ప్రతి విషయమును ప్రతినిత్యము గమనించుచునే యుండును.

## అదనపు అధ్యయనము కొరకు

### స్త్రీలు లోబడియుండుట సంస్కృతికి సంబంధించిన విషయమై యున్నదా?

భార్యలు భర్తలతో కలిగియుండు సంబంధము విషయములో, మొదటి శతాబ్దము నాటి సంస్కృతిలో ఏది ఆమోదయోగ్యమైదియై యుండెనో దాని గూర్చి మాత్రమే, లేదా సంస్కృతిలోని దూషణల దిద్దుబాట్లకు సంబంధించిన విషయములను మాత్రమే, పౌలు చెప్పుచుండెనని అనేకులు చెప్పుదురు కాబట్టి, భార్యలు తమ భర్తలకు లోబడియుండవలసిన అవసరము యిక ఏమాత్రమును లేదను దృక్పథమును వారు కలిగియున్నారు. ఏదిఏమైనా, లేఖనములలో స్త్రీల కొరకు ఇవ్వబడిన ఆదేశములు సంస్కృతిపై ఆధారపడలేదు. ఇతరులకు లోబడియుండుటకు సంబంధించినంత వరకు, ఎడుఅర్డ్ స్క్వైజర్ ఇలా వ్రాసాడు, "సరైన దృష్టికోణంలో చూచినట్లయితే, లోబడుట ఇతరులకు కాదు కానీ ప్రభువునకే అని దానిని వ్యాఖ్యానించవలెను (కొలొస్సయులకు 3:23). ప్రథమమందు ఈ విషయం ముందుగానే ఊహించుకొనిన వివరము ప్రతి మానవ యజమాని నుండి పొందుకొనబడవలసిన సంపూర్ణ స్వతంత్రము కంటే తక్కువైనదేమీ కాదు."[7]

*లేఖనములు "ఆది"ని సూచించుచున్నవి.* పౌలు మరియు పేతురు వ్రాసిన ఈ క్రింద ప్రకటనలను గమనించండి:

> ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తనియు, *స్త్రీకి శిరస్సు పురుషుడనియు,* క్రీస్తుకు శిరస్సు దేవుడనియు మీరు తెలిసికొనవలెనని కోరుచున్నాను. ఏలయనగా *స్త్రీ పురుషుని నుండి కలిగెనే* గాని, పురుషుడు స్త్రీనుండి కలుగలేదు. మరియు *స్త్రీ పురుషుని కొరకే* గాని పురుషుడు స్త్రీ కొరకు సృష్టింపబడలేదు (1 కొరింథీయులకు 11:3, 8, 9).
>
> స్త్రీలు ... *లోబడియుండవలసినదే* ... *ఈలాగు ధర్మశాస్త్రము చెప్పుచున్నది* (1 కొరింథీయులకు 14:34).
>
> స్త్రీ మౌనముగా ఉండవలసినదే గాని, ఉపదేశించుటకైనను పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను. మొదట *ఆదామును తరువాత హవ్వయును నిర్మింపబడిరి కారా* (1 తిమోతి 2:12, 13).

> "*అటువలె పూర్వము ఆశ్రయించిన* పరిశుద్ధ స్త్రీలును, తమ స్వపురుషులకు లోబడియుండుట చేత, తమ్మును తాము అలంకరించుకొనిరి" (1 పేతురు 3:5).

"స్త్రీకి శిరస్సు పురుషుడు"; "స్త్రీ పురుషుని కొరకు సృష్టింపబడెను"; "స్త్రీలు ... లోబడియుండవలెను ... ఈలాగు ధర్మశాస్త్రము చెప్పుచున్నది"; "మొదట ఆదామును, తరువాత హవ్వయును నిర్మింపబడిరి" అని వ్రాస్తూ పౌలు దేవుని సృష్టి క్రమము గూర్చి విన్నవించుకొన్నాడు. దేవునికి అంగీకారమైనదై యుండుటకు ప్రయత్నించుచుండిన క్రైస్తవ స్త్రీలకు ఒక మాదిరిగా "పూర్వము" దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీల ప్రవర్తనను పేతురు నివేదించాడు.

"స్త్రీలు పురుషులకు లోబడియుండవలెనని ధర్మశాస్త్రములో ఎక్కడ చెప్పబడియున్నది?" అని కొందరు ప్రశ్నించారు (1 కొరింథీయులకు 14:34 చూడుము) ఏలయనగా మోషేకు బయలుపరచబడిన ధర్మశాస్త్రములోను నియమములలోను ఇటువంటి వాంగ్మూలమేదియును వారు కనుగొనలేదని వారు గమనించారు, గ్రహించారు. ఈ ప్రశ్నకు ఈ క్రింది సమాధానము సరిపోతుంది: మోషేకియ్యబడిన ధర్మశాస్త్రములో లేని పాత నిబంధనలోని వాంగ్మూలములను ప్రస్తావించుటకు యేసు కొన్ని పర్యాయములు "ధర్మశాస్త్రము" అనుపదమును ప్రయోగించాడు (యోహాను 10:34లో ఉల్లేఖనముగా పేర్కొనబడిన కీర్తనలు 82:6; యోహాను 15:25లో పేర్కొనబడిన కీర్తనలు 35:19 చూడుము). ఇంతేగాక, ఆయన యెషయా 28:11, 12ను ఉల్లేఖించి పేర్కొనుచుండిప్పటికిని, 1 కొరింథీయులకు 14:21లో ఆయన బోధించుచుండిన విషయానికి తోడూ పౌలు ధర్మశాస్త్రమును ఆశ్రయించాడు. గలతీయులకు 4:21, 22లో పౌలు, శారా మరియు హాగరుల గూర్చి ప్రస్తావించుచుండినప్పుడు, ఆయన ధర్మశాస్త్రమును పరోక్షంగా పేర్కొనుట ఈ ప్రశ్నకు యింకా ఎక్కువ దగ్గరగా ఉన్నది. స్పష్టముగా, పౌలు ధర్మశాస్త్రమును ఉల్లేఖించి చెప్పుట, దేవుడు మోషేకిచ్చిన నియమములకే పరిమితము చేయబడినదై యుండలేదు. పరిశుద్ధ సత్యవేదములోని ఆదికాండము, ఒక విశాలమైన దృక్పథములోను ధర్మశాస్త్రములో ఒక భాగమై యుండినది. ఈ విధంగా, "అతడు నిన్ను ఏలును" అని ధర్మశాస్త్రము సెలవిచ్చుచున్నదని చెప్పుట (ఆదికాండము 3:16), పౌలుకు కచ్చితమైనదై యుండినది.

*పౌలు స్త్రీలకిచ్చిన ఆదేశములు సంస్కృతికి ప్రతికూలముగా నుండినవి.* ఆయన క్రైస్తవ స్త్రీలకిచ్చిన ఆదేశములు (1 కొరింథీయులకు 14:34, 35; 1 తిమోతి 2:11, 12) వారు నివసించుచుండిన సమాజముల యొక్క సంస్కృతిపరమైన అభ్యాసములపై ఆధారపడలేదు. గ్రీకు–రోమా సంకర సంస్కృతిలో, స్త్రీలు వారి సమాజములలో నాయకత్వ స్థానములను నిర్వహించుచుండిరి. క్రొత్త నిబంధన ప్రపంచంలో నెలకొని యుండిన స్త్రీల పరపతిని చిత్రీకరించు సంబంధిత ఉల్లేఖనములు కొన్ని ఈ క్రింది ఇవ్వబడియిన్నవి:

> స్త్రీలు అనేక జనసామాన్య అధికార హోదాలను నిర్వహించారనియు, పురుషులతో సమానంగా వారి విధులను నిర్వహించవలసి యుండినదనియు సూచించుటకు యథార్థముగా ఉన్నటువంటి ఋజువు ఉన్నది. స్త్రీలు ప్రజలకు చేసిన సేవలను మరియు వారి ఉదారతను పొగడుచు, వారిని గౌరవించుచు విస్తృతమైన అధికార శాసనములలో వారి పేర్లు వ్రాయబడి యున్నవి. వారు ఆలయములను నిర్వహించారు, క్రీడలను, ఊరేగింపులను, మరియు బల్యర్పణలను పోషించారు.[8]

> స్త్రీలు యాజక పరిచర్య ధర్మములను నిర్వహించారు, అత్యధిక అన్యమతారాధికుల విభిన్న పూజలలో, డయాన, ఐసిస్, లివియ, డయానిసోస్, లైబర్ మరియు లైబెరా అను రోమా దేవతలతో సహా, ఇతర మత నాయకులై యుండిరి. పూజా పద్ధతులలో చురుకుగా పాల్గొనుచుండిరి, సంగీతములను మరియు ఆచార కర్మకాండలను సంకలనము చేసిరి, దేవాలయముల యొక్కయు విభిన్న పూజల ద్వారా వచ్చుచుండిన ఆదాయములకు యాజమాన్యం వహించుచు వాటిని నిర్వహించుచుండిరి, విందులకు సంబంధించిన వేడుకలను ఏర్పాటుచేయుచుండిరి, సంగీత వాయిద్యములను వాయించిరి, అనేక ప్రజా సంబంధిత నాయకత్వ తీర్మానములను తీసికొనిరి.[9]

> … హెల్లేనీయులకు సంబంధించిన యుగము సర్వసాధారణంగా స్త్రీల దాస్య విమోచనా కాలమై యుండినది … . పౌలు కాలము నాటి స్త్రీలు వారి కదలికల విషయంలో చెప్పుకోదగినంత స్వతంత్రతను అనుభవించారు, వివాహము చేసికొనుట మరియు విడాకులిచ్చుట విషయంలో హక్కులు కలిగియుండిరి, మరియు కొన్ని స్థలములలోను విభిన్న పూజాపద్ధతులలోను, ప్రజా మరియు మత సంబంధమైన అధికార హోదాలను నిర్వహించు హక్కులు కలిగియుండిరి … . గ్రీకు స్త్రీలు పరదా పద్ధతికి పూర్తిగా స్వస్తిపలికారు, సరికదా లెక్కలేనన్నిశిరోజాలంకరణ శైలులను అవలంబించుటకు అవసరమైన ప్రయోగములు చేయుచుండిరి.[10]

స్త్రీలు వారి వారి సమాజములలో ప్రాముఖ్యత సంపాదించుకొన్నారనియు, పురుషులతో సమానంగా అధికార హోదాలను సృష్టించుటకును నిర్వహించుటకును అనుమతింపబడ్డారనియు సూచించు వారి కార్యకలాపములను అపొస్తలుల కార్యముల గ్రంథంలో, లూకా గ్రంథస్తం చేసాడు. "మర్యాదగల స్త్రీలు" మరియు "పట్టణ ప్రముఖులు" పౌలు మరియు బర్నబాలకు విరోధముగా అంతియొకయ పిసిదియలో హింసాత్మక చర్యలను పురికొల్పారు (అపొస్తలుల కార్యములు 13:50), మరియు థెస్సలొనీకలో ఘనతగల స్త్రీలలో అనేకులు ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచారు (అపొస్తలుల కార్యములు 17:4).

లేఖనములలో అనుమతింపబడని పాత్రలను స్త్రీలకు సమాజము అప్పజెప్పినప్పటికిని, క్రైస్తవ స్త్రీలు లోకము యొక్క ప్రభావములను అనుసరించకూడదు (రోమీయులకు 12:2). యేసు ఆజ్ఞలు ప్రస్తుతము ప్రచలితమై యున్న సాంస్కృతిక వాడుకలకు పరస్పము విరుద్ధమైనవై యున్నప్పటికిని, క్రైస్తవ స్త్రీలు వాటికి లోబడుట వారి లక్ష్యమై యుండవలెను. క్రైస్తవ స్త్రీలు, "సమాజము నా నుండి ఏమి కోరుచున్నది?" అని కాదు, కానీ "యేసు నా నుండి ఏమి కోరుచున్నాడు?" అని ప్రశ్నించుకొనవలెను.

## అన్వయము

### కుటుంబ సంబంధములు

భర్త తన భార్యను, భార్య తన భర్తను, తలిదండ్రులు వారి పిల్లలను ప్రేమింపవలెనని దేవుడు కోరుచున్నాడు (ఎఫెసీయులకు 5:25; తీతు 2:4). ఒకరి యెడల మరొకరికి ఉండవలసిన అనురాగము – తండ్రి, కుమారుని యెడల కలిగియున్నటువంటి ప్రేమను (యోహాను 3:35; 5:20; 17:23, 24) మరియు కుమారుడు తండ్రి యెడల కలిగియున్నటువంటి ప్రేమను (యోహాను 14:31) – కుటుంబములు అభివృద్ధిచేసికొనవలెను. యేసు తన ఇహలోక

తాత్కాలిక తండ్రికి లోబడినట్లుగా (లూకా 2:51), పిల్లలు వారి తండ్రుల చిత్తమునకు ప్రతిస్పందించునట్టి లక్షణముగలవారై యుండవలెను.

కుటుంబ సభ్యులు ఒకరి యెడల మరొకరు వారి ప్రేమను వ్యక్తము చేయుటకు అవసరమైన మార్గనిర్దేశనములు 1 కొరింథీయులకు 13:4–8లో కలవు. ఈ వచనములను ఒక ఫలకము మీద వ్రాయించి గృహములో అందరికి కనబడునట్లు గోడ మీద వ్రేలాడదీయుట ఒక మంచి ఆలోచనయై యున్నది. కుటుంబ సభ్యులందరు ఒకరి యెడల మరొకరు ప్రవర్తింపదగు తీరును గుర్తుచేసికొనునట్లు ఈ వాక్యములను తరచుగా చదువుకొనుచుండవలెను.

మన నుండి ఆశింపబడు బాధ్యతను మనము వహించగలుగునట్లును, మన వంతు పాత్ర గూర్చి మనము సరైన విధంగా ప్రతిస్పందించునట్లును మన ఒక్కొక్కరి విషయంలో దేవుని చిత్తము ఏమైయున్నదో మనలో ప్రతి ఒక్కరము అర్థంచేసికొనవలెను, మరియు గౌరవించవలెను. మన బాధ్యత కాని పని చేయుటకు మనము ప్రయత్నించినప్పుడు తారుమారైన అననుకూల పరిస్థితులు తలెత్తును.

*భర్త, కుటుంబమునకు శిరస్సై యుండవలెనని దేవుడు కోరుచున్నాడు* (ఎఫెసీయులకు 5:23). కుటుంబ వ్యవస్థకు భర్త ఒక నాయకుడై యుండవలెను. మనము వహించవలసిన పాత్రలు తారుమారౌనప్పుడు సమస్యలు తలెత్తును.

పాత నిబంధన కాలంలో శారా వంటి దైవభక్తి గల భార్యలు ప్రవర్తించినట్లుగా, *భార్యలు వారి భర్తలకు లోబడుట ద్వారా వారు తమ్మునుతాము అలంకరించుకొనవలెను.*

> అటువలె పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలును, తమ స్వపురుషులకు లోబడియుండుట చేత, తమ్మును తాము అలంకరించుకొనిరి; ఆ ప్రకారము శారా అబ్రాహామును యజమానుడని పిలుచుచు, అతడికి లోబడి యుండెను, మీరును యోగ్యముగా నడుచుకొనుచు ఏ భయమునకు బెదరక యున్న యెడల ఆమెకు పిల్లలగుదురు (1 పేతురు 3:5, 6).

దైవభక్తిగల భార్య గూర్చిన ఒక వర్ణన సామెతలు 31:10–31లో కలదు. ఆమె కష్టపడి చేయుచుండు పనులకు, తన భర్త మరియు పిల్లల గూర్చి ఆమె వహించుచు శ్రద్ధతో సహా, ఈ వాక్యభాగము వర్ణించుచున్నది.

*తలిదండ్రులు వారి పిల్లలకు మంచి మాదిరులై యుండవలెను.* మంచి మరియు చెడు తల్లిదండ్రుల ఉదాహరణములను పరిశుద్ధ సత్యవేదము మనకు తెలియజెప్పుచున్నది. అబ్రాహాము, మంచి తండ్రికి ఒక మాదిరియై యున్నాడు. దేవుడు తన సంతతిని ఆశీర్వదించునట్లు, అబ్రాహాము తన సంతతికి దేవుని మార్గముల గూర్చి అవసరమైన శిక్షణ నిచ్చునని దేవునికి తెలియును (ఆదికాండము 18:19).

*పిల్లలు వారి తలిదండ్రులను గౌరవించుచు వారికి లోబడవలెను* (ఎఫెసీయులకు 6:1–3). ఇది దేవుని ప్రణాళికయై యున్నది. అబ్షాలోము తన తండ్రిని అభిమానించి, ఆయనకు విరోధముగా తిరుగుబాటు చేయక యుండినట్లయితో, ఇశ్రాయేలు రాజ్యములోను, దావీదు కుటుంబములోను సమస్తము చక్కగా సాగిపోయేదే. తన కుమారుని తిరుగుబాటు మూలమున, దావీదు తన ప్రాణమును దక్కించుకొనుటకు పారిపోయి తలదాచుకొనవలసి వచ్చినది; కానీ యుద్ధము మొదలైనప్పుడు, అబ్షాలోము సైన్యము ఓటమి పాలయ్యింది,

అబ్షాలోము హతమార్చబడ్డాడు. దావీదు, బ్రద్దలైన హృదయముగలవాడైన తండ్రిగా, “నా కుమారుడా అబ్షాలోమా, నా కుమారుడా అబ్షాలోమా! అని కేకలువేయుచు, అయ్యో నా కుమారుడా, నీకు బదులుగా నేను చనిపోయిన యెడల ఎంత బాగుండును; నా కుమారుడా అబ్షాలోమా, నా కుమారుడా!” అని యేడ్చాడు (2 సమూయేలు 18:33).

కుటుంబ సమస్యలు తలెత్తాయి ఏలయనగా కుటుంబ సభ్యుల పాత్ర గూర్చిన దేవుని ప్రణాళికలు అనుసరింపబడలేదు. కుటుంబము కొరకు దేవుడు వేసిన ప్రణాళికలను మనము కొంతైనా మెరుగుపర్చజాలము.

**పౌర సంబంధములు**

పౌర సంబంధముల విషయములో ప్రజలు ఒకరితో నొకరు మర్యాదపూర్వకముగా మెలగవలెనని దేవుడు కోరుచున్నాడు. కొలొస్సీ పత్రికలో వ్రాయబడిన యజమానుడు–దాసుడు గూర్చిన సంబంధము నుండి మనము నేర్చుకొని, యజమానులు మరియు పనివారికి మధ్య జరుగుచుండు పరస్పర ప్రభావశాలియైన చర్యలలో లేక అటువంటి పరిస్థితులకు దానిని అన్వయింపవచ్చును.

*దాసులు వారి యజమానులను సంతోషపెట్టవలెనను* సహృదయములో *వారికి సంపూర్ణముగా లోబడుచుండవలెను.* వారు ప్రభువునకు భయపడుచున్నవారై వారి యజమానులను సేవించవలెను. ఇహలోక యజమానుడు ఇవ్వగల ప్రతిఫలము కంటె మరి శ్రేష్ఠమైన ప్రతిఫలమును దేవుడనుగ్రహించునని గ్రహించుచు, వారు ప్రభువునకు పనిచేయుచున్నట్లుగా వారికప్పగింపబడిన పనులు చేయుచుండవలెను.

ఎలీషా దాసుడు గేహజీ, ఒక నాడు, తన సొంత ఆలోచనల ప్రకారము అడుగులువేయాలని తీర్మానించుకొనినంత వరకు, ప్రవక్త కోరికలను బహుచక్కగా నిర్వర్తించుచువచ్చాడు. దేవుడు నయమానుకుండిన కుష్ఠరోగమును స్వస్థపరచిన తరువాత ఆయన తీసికొనివచ్చిన బహుమానమును ఎలీషా తీసికొనవలసినదని నయమాను ఎలీషాను బ్రతిమలాడినప్పుడు గేహజీ అక్కడనే ఉండినాడు.

“ఎవని సన్నిధిని నేను నిలువబడియున్నానో, ఇశ్రాయేలు దేవుడైన ఆ యెహోవా జీవము తోడు నేనేమియు తీసికొనను” అని ఎలీషా చెప్పిన మాటలు గేహజీ విన్నాడు (2 రాజులు 5:16). వాడు ఎలీషా కోరికలకు విరుద్ధంగా చేయుచున్నవాడగునని వాడు గ్రహించియుండును, కానీ వాడు నయమానును వెంబడించాడు, ఆ బహుమానమును నయమాను వానికిచ్చునట్లు నయమానుతో అబద్ధం చెప్పాడు. వానిలో ఉండిన పేరాస మరియు అవిధేయత, నయమానుకుండిన కుష్ఠరోగమును వానికి తెచ్చిపెట్టినవి (2 రాజులు 5:27). దాసులు దేవుని చిత్తమును ఉల్లఘించునట్లు కోరబడినంత వరకు వారి యజమానుల కోరికలను వారు మన్నించాలని దేవుడు కోరుచున్నాడు (అపొస్తలుల కార్యములు 5:29).

దాసులకు ఇవ్వబడిన ఆదేశములు పనివారికి కూడ వర్తించగలవు. మనము ఏనాటి జీతమునకు సరిపడు పనులకు ఆనాడు చేయుచుండవలెను. యేసు గౌరవింపబడునట్లును, ఆయన నామమునకు మనము దూషణ కలుగజేయకుండునట్లును మనము పనులు చేయుచుండవలెను.

ఉన్నత పాఠశాల విద్యనభ్యసించిన విద్యార్థి ఒకడు ఒక గిడ్డంగిలో వాని కంటె పెద్దవారైన

వారితో, వాడు అంతగా కష్టపడుచు పనులు చేయాల్సిన అవసరం లేదని వానికి సలహా ఇచ్చిన వారితో, కలిసి పనిచేయుటకు మొదలుపెట్టాడు. పై అధికారులు గమనించుచుండినప్పుడు మాత్రమే వారు చక్కగా పనులు చేయుచుండిరి, వారు వెళ్లిపోగానే వీరు మామూలుగా పనులు చేయుచుండిరి. పై అధికారులు దగ్గరలో ఉన్నా లేకున్నా, వారు గమనించుచుండినా గమనించలేకపోయినా, ఈ విద్యార్థి ఎంతో కష్టించి పనులు చేయుచుండెను గనుక వాని కంటె పెద్దవారు పనులు చేయుచుండిన తీరు వలన వానికి ఎంతో బాధ కలుగుచుండినది. ఒక రోజున మధ్యాహ్న భోజన సమయంలో, వారు కొలొస్సీ 3:23 చదువాడు, గనుక మనుష్యుల కొరకు కాదు గాని యేసు కొరకు పనులు చేయవలెనని తీర్మానించుకొన్నాడు. ఇంతలో వాని పై అధికారికి ఒక సహాయకుడు అవసరమయ్యాడు కాబట్టి ఎవరిని ఎంపికచేసికొనవలెనా అని ఆయన వెదకుచు, ఈ విద్యార్థి కంటె పెద్దవారైన వారందరిని దాటవేసి, చిన్నవాడైన విద్యార్థిని ఆయనకు అసిస్టెంటుగా ఎంపిక చేసికొన్నాడు.

ఒక సువార్తికుడు ఒకానొక నగరంలో నిర్వహించిన సువార్త సభలో ఒక్కరే వారి ప్రతిస్పందనను చూపించారు. బాప్తిస్మము పొందుటకు ముందుకు వచ్చిన ఆ స్త్రీనిబట్టి ఆయన తన మనస్సులో ముగ్ధుడయ్యాడు, ఏలయనగా ఆమె సమాజంలో ఎంతో ముఖ్యమైన వ్యక్తియై యుండినది. గనుక ఆయన ఇదే మాటలను, ఇదే పద్ధతిని ఇతర సభలలో సహితము ప్రయోగించునట్లు, ఆమె ఆ విధంగా నిర్మాణాత్మకమైన ప్రతిస్పందనన ప్రదర్శించునట్లు ఆయన ఏ యే మాటలు పలికాడో, ఏమి చేసాడో తెలుసుకొనవలెనను కోరికలతో, "అమ్మా, మీరు సువార్తకు విధేయులగునట్లు నేను చెప్పిన మాటలేమిటో, చేసిన పనులేమిటో దయచేసి నాకు తెలియజెప్పగలరా?" అని ఆమెను అడిగాడు. అందుకామె, "అది మీరు చెప్పిన మాటలు కావు, మీరు చేసిన పనులు అసలే కావు. కానీ కూడికలు జరుగుచుండిన సమయంలో నేను ఒక స్త్రీ ప్రక్కలో కూర్చొని యుంటిని, ఆ స్త్రీ మీకు జ్ఞాపకమున్నదా? ఆమె ఆ ఇంట్లో పనిచేసే పనిమనిషి. ఆమె జీవిత విధానము మాత్రమేగాక, ఆమె పనులు చేయుచుండిన తీరును కూడ చూచిన నేను గొప్పగా ప్రభావితమయ్యాను గనుక ఆమె మతమేమిటో అని ఆమెను అడిగి తెలిసికొన్నాను. ఆమె యేసు ప్రభువును ఎందుకు నమ్ముకొనుచున్నదో, ఆమె ఎందుకు ఆయన సంఘములో ఒక సభ్యురాలుగా ఉంటున్నదో నాకు వినయంతో వివరించింది. గనుక నేను కూడ క్రీస్తునంగీకరించిన ఒక క్రైస్తవురాలై, క్రీస్తు సంఘములో ఒక సభ్యురాలనై యుండవలెనని తీర్మానించుకొనుటకు ఆమెయే కారణము" అని బదులు పలికినది.

*యజమానులు వారి పరలోకమందలి యజమానుడు, యేసును గౌరవించవలెను. వారు* తమ దాసుల యెడల సముచితముగా వ్యవహరించవలెను. ఈ ఆదేశము సంఘములో యజమానులై యున్నవారికి కూడ వర్తించును. పై అధికారములలో ఉన్నవారు పనివారి శ్రేయస్సుగూర్చి ఆలోచించువారై యుండవలెను. పనివారికి న్యాయసమ్మతమైన జీతములిచ్చుచు, పనివారు యజమానుల యెడల ఎలా వ్యవహరించవలెనని వారు కోరుదురో వారు కూడ అలాగుననే వారితో వ్యవహరించవలెను (మత్తయి 7:12).

**సరైన సంబంధములను అభివృద్ధిచేసికొనుట**

దేవునితో మనకుండు సంబంధము మన మొదటి బాధ్యతయై యున్నది, ఇతరులతో మనము కలిగియుండు సంబంధము, రెండవది. ప్రతి సంబంధము ప్రేమ మీద ఆధారపడినదై

యుండవలెను, ఇందులో దేవుని యెడల, తోటి విశ్వాసుల యెడల, పొరుగువారి యెడల, మరియు శత్రువుల యెడల గల ప్రేమ కూడ ఉన్నది. మన సకల సంబంధములు ప్రేమయను పునాది మీద నిర్మింపబడినవైనట్లయితే, మనము ఒకరితో నొకరము కలిగియుండు సంబంధములలోని అనేక సమస్యలు చాలా వరకు పరిష్కరింపబడగలవు.

వారు ఇతరులతో కలిగియుండు సంబంధములను క్రైస్తవులు గ్రహించుచు, వాటిని గౌరవించుచు, ఆ యా సంబంధములలో యిమిడివుండు కర్తవ్యములను వారు నెరవేర్చవలసినవారై యున్నారు. క్రీస్తు శరీరములోని సభ్యులు ఒకరి యెడల మరొకరు బాధ్యులైయున్నారు. సంఘ సభ్యుడు/సభ్యురాలుగా సంఘములో నిర్వర్తించవలసిన ఏదో ఒక పాత్ర ప్రతి విశ్వాసికున్నది.

*భార్యాభర్తలు* (కొలొస్సయులకు 3:18, 19). భార్య భర్తకు లోబడవలెను – భౌతికంగా ఆమె కంటె బలవంతుడైన భర్త ఆమెను తన అదుపులో లేక ఆధీనములో నుంచుకొనగల శక్తి కలిగియున్నందును బట్టి కాదు, కానీ ప్రభువు చిత్తప్రకారము తన భర్తకు లోబడుటకు ఇష్టపడుచుండుటనుబట్టి లోబడవలెను. భావోద్రేకముల దూషణ ద్వారా భార్య తన భర్తపై పెత్తనం చెలాయించకూడదు, అది శారీరకంగా కలుగజేయబడగల సర్వనాశనమువంటిదై యుండును. సాధారణంగా, స్త్రీలు వారి అందమునుబట్టి పురుషులను ఆకర్షించుకొందురు. అలాగే వారు సంక్షేమము, పోషణ మరియు శ్రద్ధను సమకూర్చుటకు కలిగియున్న సామర్థ్యమునుబట్టి పురుషులను స్త్రీలు ఆకర్షించుకొందురు. ఈ గుణగణములు వ్యక్తిత వ్యతిరేకముగా పనికివచ్చునట్లు ప్రయోగింపబడకూడదు.

భర్తలు తమ భార్యలను బెదిరింపులతో వేధించుచుండకూడదు లేక భార్యలు వారికి లోబడవలెననివారిని బలవంతము చేయుచుండకూడదు. దానికి బదులుగా, భార్యల యెడల గల ప్రగాఢ ప్రేమనుబట్టి వారి యెడల తగు శ్రద్ధ కనుపర్చుచుండవలెను (ఎఫెసీయులకు 5:25). ఇద్దరు లేక అంతకంటె ఎక్కువ మంది యున్న ప్రతి చోట లేక ప్రతి సందర్భములో, ఎవరో ఒకరు ముందడుగు వేయుచుండవలెను; ఇద్దరు కూడ ఒకే సమయంలో నాయకులై యుండలేరు. దేవుని ఏర్పాటే ఎల్లవేళలయందు ఉత్తమోత్తమంగా ప్రయోజనకరమౌతుంది.

*తలిదండ్రులు మరియు పిల్లలు* (కొలొస్సయులకు 3:20, 21). పిల్లలు అధికారులను, అధికారమును, మరి ముఖ్యంగా తలిదండ్రుల అధికారమును అగౌరవపరచినప్పుడు సమాజము విచ్ఛిన్నమౌతుంది. సంఘము యొక్క భవిష్యత్తు విధేయతను నేర్చుకొను పిల్లలపై ఆధారపడియున్నది. ఇందునుబట్టియే పెద్దలైనవారు మర్యాదగలవారును, విధేయులునైన పిల్లలను కలిగియుండవలెను (1 తిమోతి 3:4, 5).

తండ్రులు పిల్లలకు ఆజానుబాహులుగాను, వారిని అతిసులభంగా అదుపులోనికి తీసికొనగల నియంతలుగాను కనిపించవచ్చును. తండ్రులు కనుపర్చు ఆగ్రహము మరియు అనంగీకారము వారి దృష్టికి బహు భయంకరమైనదిగా కనిపించవచ్చును. పిల్లలు యెడల కఠినముగా ప్రవర్తించుచు, అధికార స్వరంతో వారి ఆధీనంలో ఉంచుకొనుటకు ప్రయత్నించుచు లేక పెత్తనం చెలాయించుచుండు తండ్రులు, వారు అంత ముఖ్యమైనవారు కారు, వారు అసమర్థులై యున్నారను అనుభూతిని పిల్లల మనస్సుల్లో పుట్టించగలరు ఇలా జరుగునట్లు అనుమతించటకు బదులుగా, తండ్రులు వారి పిల్లల మనస్సుల్లో నమ్మకమును, ఆత్మవిశ్వాసమును సృష్టించుచు వారిని ప్రోత్సాహించుచుండవలెను. వారి తండ్రులు ఏ

పనైనా చేయగలరని, ఎంతటి ఘనకార్యమునైనా సాధించగలరని కొన్ని పర్యాయములు చిన్న పిల్లలు నమ్ముదురు. వారు కూడ, సార్థకమగు సకల లక్ష్యములను సాధించగల సామర్థ్యము వారికున్నదను నమ్మకమును పెంపొందించకొనునట్లు తండ్రులు వారి పిల్లలకు సహాయం చేయవలెను.

*యజమానులు మరియు దాసులు* (3:22-4:1). క్రీస్తునందు వ్యక్తుల నడుమ ఏ బేధమును ఉండకూడదు, ఏలయనగా ఆధ్యాత్మికముగా అందరు సమానులే (గలతీయులకు 3:28). మారుమనస్సు నొందిన దాసులు క్రీస్తునందు స్వతంత్రులయ్యారు. ఆధ్యాత్మికముగా వారి యజమానులతో వారు సమానులైనప్పటికిని, వారి యజమానుల యెడల వారికుండిన కర్తవ్యము యింకను మిగిలియున్నది. ఇప్పుడు వారు మరి ఎక్కువ భక్తిశ్రద్ధలతో వారి యజమానులను సేవించుచుండవలెనని ప్రభువు కోరుచున్నాడు. వారు చేయు పరిచారము, యేసుకు చేయుచున్న పరిచారమువంటిదై యుండవలెను. గొప్పదియు, చిట్టచివరిదియునైన ప్రతిఫలము ఇచ్చువాడు యేసే అని ఎరిగియండి, పనివారు యేసు యెడల చేయునట్లే వారి యజమానుల యెడల చేయుచుండవలెను. మానవ శరీరము ధరించి మనము ఈ లోకములో జీవించినంత కాలము ఏమేమి చేయుచుంటిమో ప్రతి విషయమునకు మనలో ప్రతి ఒక్కరము యేసుకు లెక్క ఒప్పజెప్పవలసి యున్నది (2 కొరింథీయులకు 5:10).

దాసులను వారు గౌరవించుచు వారి యెడల న్యాయముగా ప్రవర్తింపవలెనని యజమానులకు తెలియజెప్పబడినది, ఏలయనగా వారు ఆయనవంటి యజమానుడై యుండవలెనని ఆశించుచున్నవాడే, వారికి ఒక యజమానుడున్నాడు, క్రీస్తు వైఖరిని అభివృద్ధిచేసిన యజమానుడు వారి దాసుల యెడల వారి హృదయములో ప్రేమను పెంచి వారిని స్వతంత్రులను గావింపవలెనను ఆశాపూర్వక ఆలోచనను కలిగించగలడు. వారికి సంపూర్ణ స్వాతంత్రము ఇవ్వబడినప్పటికిని, వారి ఘనమైన యజమానులను విడిచివెళ్లుటకు నిరాకరించునంతగా కొందరు దాసులు వారి యజమానులకు ఆకర్షితులయ్యారు. పై అధికార హోదాలో నున్న ఎవరైనను వారి క్రింద పనులుచేయుచుండువారితో వ్యవహరించగల మంచి మాదిరి నిమిత్తము యేసును చూడవలెను.

---

సూచనలు

[1]కొలస్సీ పత్రికలోని ఈ విభాగము ప్రజలను పునరావృతమగుచుండు వర్గములలో కలుపుకొనియుండగలదు. డేవిడ్ ఎమ్. హే ఒక విషయాన్ని గమనించాడు, “స్త్రీలు ఏక కాలంలో భార్యలుగాను, తల్లిదండ్రులుగాను, (కుమార్తెలుగాను,) మరియు దాసుల యజమానురాండ్రుగాను ఉండగలరు. పురుషులు భర్తలుగాను, కుమారులుగాను, దాసుల యజమానులుగాను, ఉండగలరు. ఒకేవ్యక్తి ఒక సంబంధములో ఉన్నతమైనవాడై యుండవచ్చును మరొక సంబంధములో తక్కువైన స్థాయిలో ఉండవచ్చును” (David M. Hay, *Colossians*, Abingdon New Testament Commentaries [Nashville: Abingdon Press, 2000], 140). [2]Robert G. Bratcher and Eugene A. Nida, *A Translators Handbook on Paul's Letters to the Colossians and to Philemon*, Helps for Translators (New York: United Bible Societies, 1977), 92. [3]Peter T. O'Brien, *Colossians, Philemon,* Word Biblical Commentary, vol. 44 (Waco, Tex.: Word Books, 1982), 224. [4]మత్తయి 4:4; రోమీయులకు 7:17; 1 కొరింథీయులకు 1:17; 1 తిమోతి 4:12; 1 పేతురు 3:3, 4 కూడ చూడుము. [5]E. K. Simpson and F. F. Bruce, *Commentary on the Epistles to the Ephesians and the Colossians,* The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1957), 294. [6]మత్తయి 26:20; మార్కు 14:17; లూకా 22:14; యోహాను 13:2, 4 చూడుము. [7]Eduard Schweizer, *The Letter to the Colossians: A Commentary,*

trans. Andrew Chester (Zürich: Benziger Verag, 1976; reprint, Minneapolis: Augsburg Publishing House, 1982), 219. [8]Ross Shepard Kraemer and Mary Rose D'Angelo, *Women and Christian Origins* (New York: Oxford University Press, 1999), 86. [9]Valerie A. Abrahamsen, *Women and Worship at Philippi: Diana/Artemis and Other Cults in the Early Christian Era* (Portland, Maine: Astarte Shell Press, 1995), 194. [10]William Baird, *The Corinthian Church - A Biblical Approach to Urban Culture* (New York: Abingdon Press, 1964), 121-22.

## కొలొస్సీ 3:18–4:1లోని సత్సంబంధములకు సరిపడు మార్గదర్శక సూత్రములు[1]

| వచనాలు | సంబోధించినవారు | ఇవ్వబడిన ఆదేశములు | వివరణ |
|---|---|---|---|
| 3:18 | భార్యలు | మీ భర్తలకు లోబడియుండుడి | ప్రభువునకు తగినట్లుగా |
| 3:19 | భర్తలు | మీ భార్యలను ప్రేమించుడి | |
| 3:20 | పిల్లలు | మీ తలిదండ్రులకు లోబడియుండుడి | ఇది ప్రభువునుబట్టి మెచ్చుకొనతగినది |
| 3:21 | తండ్రులు | మీ పిల్లలకు కోపము పుట్టింపకుడి | అప్పుడు వారి మనస్సు కృంగిపోదు |
| 3:22–25 | దాసులు | మీ యజమానులకు లోబడియుండుడి | మనుష్యులను సంతోషపెట్టువారైనట్టు, కంటికి కనబడవలెనని కాక, ప్రభువునకు భయపడుచు; శుద్ధాంతఃకరణగలవారై, ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి |
| 4:1 | యజమానులు | దాసుల యెడల న్యాయమైనదియు ధర్మానుసారమైనదియు చేయుడి | పరలోకమందు మీకును ఒక యజమానుడున్నాడు |

[1]యజమానుడున్నాడు ఎఫెసీయులకు 5:22–6:9; తీతు 2:2–10; 1 పేతురు 2:13–3:7.